




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 191 పేజీలు : 12, వెల రూ. 5/- బుధవారం, సెప్టెంబరు 2, 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD CHITTOR, VISHAKAPATANAM, SRIKAKULAM, ELLURU, ONGOL, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHM, GUNTUR, KURNOOL, KADAPA




## హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

## హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి

- హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం
- తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా
- అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి
- యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ

## ప్రభుత్వ హామీతో ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకున్న సీజేపీ

- సెప్టెంబర్ 5న తలపెట్టిన ఢిల్లీ మార్చ్‌ను రద్దు చేసుకున్న సీజేపీ
- సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల హామీ
- నిరసనకారులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేయనున్నట్టు వెల్లడి
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు 3 నెలల్లో పరిహారం
- ప్రభుత్వ హామీలకు కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నట్టు సీజేపీ స్పష్టీకరణ





### కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు.. తెలంగాణ ప్రభుత్వానికి

## హైకోర్టులో భారీ ఊరట

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం
- ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు
- పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు

హైదరాబాద్: తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి,

(మిగతా 2వ పేజీలో)

# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ

- మంత్రివర్గ విస్తరణపై చర్చ?
- ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ
- రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చలు
- మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రధానంగా మంతనాలు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణా మాలు, ప్రభుత్వ పాలనకు సంబం ధించిన కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణతో పాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధి ష్ఠానం ఆమోదం కోసం ఆయన వేణు గోపాల్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావ-నకు వచ్చినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ సంఘం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వారు సమర్పించిన వివరణలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధిష్ఠానం అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి వర్సిటీలు

- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి



## నల్గొండ ఘటనపై రగులుతున్న రాజకీయం

### టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

- నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి ఇంటిపై నిన్న దాడి
- బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు బయల్దేరిన రాంచందర్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి సమీపంలో ఉందన్న టీబీజేపీ చీఫ్

హైదరాబాద్: నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై నిన్న జరిగిన దాడితో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈరోజు నల్గొండ బయల్దేరిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు తార్నాకలోని ఆయన నివాసం వద్ద అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల ఆంక్షలను ధిక్కరించి ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలోకి

(మిగతా 2వ పేజీలో)

### కూతురి వ్యాఖ్యల దుమారం:

## అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ...

(మిగతా 2వ పేజీలో)



### ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై

## అభాండాలు వేయడం సరికాదు: బండి సంజయ్

- తన నియోజకవర్గానికి కేటాయించిన నిధుల్లో 94.1 శాతానికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయన్న సంజయ్
- ఏకపక్ష నివేదికలు ఇవ్వడం సరికాదని వ్యాఖ్య
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని హితవు

ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన

(మిగతా 2వ పేజీలో)

# బంగారం కొనొద్దు.. స్వదేశీ వస్తువులే వాడండి

- దేశ ప్రజలకు మోదీ పిలుపు
- భారత్ జీడీపీలో 7.8 శాతం వృద్ధి
- స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న మోదీ
- విదేశీ ప్రయాణాలు తగ్గించాలని సూచన
- విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ వద్దని పిలుపు
- అవసరం లేకపోతే బంగారం కొనొద్దని సూచన



దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులు, సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరం లేని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దని చెప్పారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కిర్గిజిస్థాన్ నుంచి మంగళవారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విడుదల చేసిన వీడియోలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం పెరిగిందని సోమవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఉన్నా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. "విదేశీ దేశాలకు పర్యటనల కోసం వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దు. 'వెడ్ ఇన్ ఇండియా' నినాదాన్ని పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు" అని మోదీ సూచించారు. స్వదేశీ వస్తువులు, సేవలను ఎక్కువగా ఉపయోగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. భారత్ స్వావలంబన సాధిస్తే స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్ల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఈ ఏడాది మేలోనూ మోదీ ప్రజలకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట 'వర్క్ ఫ్రమ్ హోమ్', ప్రజా రవాణా వినియోగం పెంచాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని సూచించారు.

# ప్రభుత్వ హామీతో ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకున్న సీజేపీ

**సెప్టెంబర్ 5న తలపెట్టిన ఢిల్లీ మార్చ్‌ను రద్దు చేసుకున్న సీజేపీ**

**సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల హామీ**

**నిరసనకారులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేయనున్నట్టు వెల్లడి**

**ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు 3 నెలల్లో పరిహారం**

**ప్రభుత్వ హామీలకు కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నట్టు సీజేపీ స్పష్టీకరణ**



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మంగళవారం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.



# హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి వర్సిటీలు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

# 14 వేల అడుగుల ఎత్తులో ఇంజిన్ సమస్య.. గోవాకు తిరిగొచ్చిన ఇండిగో విమానం

**ఉదయం 9:16కు గోవా నుంచి బయలుదేరిన విమానం**

**9:30కు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించిన ఏటీసీ**

**9:51కు గోవాలో సురక్షితంగా ల్యాండ్**

**క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు.. 3:30 గంటలకు రీషెడ్యూల్**




గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానంలో మంగళవారం ఉదయం ఇంజిన్ సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని తిరిగి గోవా విమానాశ్రయానికి మళ్లించారు. పరిస్థితిని గుర్తించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) కొద్దిసేపు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించింది. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇండిగో 6ఈ 2102 విమానం ఉదయం 9:16 గంటలకు గోవా నుంచి ఢిల్లీకి బయలుదేరింది. కొద్దిసేపటికే విమానంలోని ఓ ఇంజిన్‌లో సమస్య గుర్తించారు. దీంతో పైలట్లు విమానాన్ని గోవా వైపు మళ్లించారు. ఉదయం 9:30 గంటల సమయంలో ఏటీసీ ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించింది. విమానం దక్షిణ మహారాష్ట్ర తీర ప్రాంతం మీదుగా సుమారు 14 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో వెనక్కి మళ్లినట్లు ఫ్లైట్ రాడార్24 డేటా తెలిపింది. గోవాకు చేరుకున్న విమానం ఉదయం 9:51 గంటలకు రన్‌వే 28పై సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం స్టాండ్ 6 వద్ద పార్క్ చేశారు. దీంతో ఉదయం 10:03 గంటలకు ఏటీసీ ఎమర్జెన్సీని ఉపసంహరించింది. విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగా దిగారు. వారిని బోర్డింగ్ ప్రాంతంలోకి తరలించారు. ఢిల్లీ వెళ్లాల్సిన విమానాన్ని మధ్యాహ్నం 3:30 గంటలకు రీషెడ్యూల్ చేశారు. విమానం ప్రయాణానికి అనుకూలంగా ఉందని నిర్ధారించిన తర్వాతే బయలుదేరనుంది. ఇంజిన్‌లో అసలు ఏ సమస్య తలెత్తిందన్నది ఇంకా తెలియాల్సి ఉంది.

# కల్వకుంట్ల కవితకు కౌంటర్ ఇచ్చిన వేముల ప్రశాంత్ రెడ్డి

**కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి**

**కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి**

**కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా**



హైదరాబాద్ :కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని... తాను ఎప్పుడూ కేసీఆర్-కవితలను కలపడానికే ప్రయత్నించాను తప్ప విడగొట్టడానికి కాదని స్పష్టం చేశారు. తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. "బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్" అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

**శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్**

**సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్**

**విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్**



హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.



# హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి

**హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం**

**తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా**

**అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి**

**యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ**

హైదరాబాద్: హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు.. తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

తరలించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తూ... ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీ నాయకులపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. బాధితులను పరామర్శించడానికి వెళుతుంటే అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1000 రోజుల పాలనలో ప్రజలను తీవ్రంగా దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి అతి సమీపంలో ఉందని జోస్యం చెప్పారు. ఈ ఘటనతో అటు నల్గొండలోనూ, ఇటు రాజధాని హైదరాబాద్‌లోనూ ఇరు పార్టీల మధ్య ప్రతిఘటనలు తీవ్రరూపం దాల్చాయి. నల్గొండలోని వర్షిత్ రెడ్డి ఇల్లు, కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా బీజేపీ కౌంటర్ ఎటాక్‌కు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా శ్రమించి అడ్డుకున్నారు. నిరసనలు, అరెస్టులతో రెండు పార్టీల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం కొనసాగుతోంది.

# అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు: బండి సంజయ్

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

# ప్రకృతి ప్రకోపానికి నేపాల్ విలవిల.. అభివృద్ధి నమూనాకు మరో హెచ్చరిక

హిమాలయాల ఒడిలో ప్రకృతి అందాలకు నిలయంగా, పర్వత పర్యాటకానికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన నేపాల్ ఒక్కసారిగా విషాదభూమిగా మారడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. భూకంపం, కొండచరియలు, హిమానీనదాల నుంచి భారీగా మంచు జారిపడటం, నదుల ఉగ్రరూపం, ఆకస్మిక వరదలు.. ఒకదాని వెంట ఒకటి విరుచుకుపడిన ప్రకృతి విపత్తులు ఆ దేశాన్ని అతలాకుతలం చేశాయి. రాసువా, ధాడింగ్ తదితర పర్వత ప్రాంతాల్లో సంభవించిన పరిణామాలు ప్రకృతి ఎంతటి శక్తిమంతమైనదో మరోసారి చాటిచెప్పాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం, వందలాది మంది గల్లంతవడం, ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, సరిహద్దు మార్గాలు ధ్వంసం కావడం కేవలం ఒక దేశానికి ఎదురైన విపత్తుగా చూడలేం. హిమాలయ ప్రాంతం మొత్తం ఎదుర్కొంటున్న పెరుగుతున్న ప్రకృతి ప్రమాదాలకు ఇది ఒక తీవ్రమైన హెచ్చరికగా పరిగణించాలి.

**భూకంపం తీవ్రత పరంగా చూస్తే అది అత్యంత భారీ స్థాయిదిగా కనిపించకపోవచ్చు. కానీ పర్వత ప్రాంతాల్లో భూకంపం ప్రభావాన్ని కేవలం రిక్టర్ స్కేల్ సంఖ్యతో అంచనా వేయడం ప్రమాదకరం. అక్కడి భౌగోళిక నిర్మాణం, కొండల వాలు, నేల స్వభావం, మంచు నిల్వలు, హిమానీనదాలు, నదీ ప్రవాహాలు అన్నీ పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఒక చిన్న భూకంప ప్రకంపన కూడా అస్థిరంగా ఉన్న కొండచరియలను కదిలించవచ్చు. కొండపై పేరుకుపోయిన మంచు ఒక్కసారిగా జారిపడితే అది దిగువ ప్రాంతంలోని నదిలోకి చేరి నీటి ప్రవాహాన్ని అనూహ్యంగా పెంచుతుంది. దానికి తోడు ఇప్పటికే వర్షాలతో నిండిన నదులు ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఈ విపత్తులో జరిగిన పరిణామాలను కూడా ఈ కోణంలోనే చూడాలి. భూకంపం ఒక ప్రారంభ ప్రకంపన అయితే, దాని తరువాత చోటుచేసుకున్న కొండచరియల విరిగిపడటం, హిమానీనదాల మంచు కదలిక, నదీ ప్రవాహం పెరగడం, ఆకస్మిక వరదలు అసలు విధ్వంసానికి కారణమయ్యాయి.**

ప్రకృతి విపత్తులు కొత్తవి కావు. నేపాల్ భూకంపాలకు అత్యంత సున్నితమైన ప్రాంతంలో ఉంది. భారత ఉపఖండం, యూరేషియా భూఫలకాల కదలికల కారణంగా హిమాలయాలు భౌగోళికంగా నిరంతర మార్పులకు లోనవుతుంటాయి. అందుకే నేపాల్, భారత్‌లోని హిమాలయ రాష్ట్రాలు, భూటాన్, టిబెట్ ప్రాంతాలు భూకంప ప్రమాదాన్ని ఎప్పుడూ ఎదుర్కొంటూనే ఉంటాయి. గతంలో సంభవించిన భారీ భూకంపాలు ఆ దేశానికి ఎంతటి నష్టాన్ని కలిగించాయో ప్రపంచానికి తెలిసిందే. అయినప్పటికీ ప్రతి విపత్తు తర్వాత కొంతకాలం మాత్రమే అప్రమత్తత కనిపించడం, ప్రమాదం తగ్గిన వెంటనే పాత పద్ధతులకు తిరిగి వెళ్లడం ఆందోళన కలిగించే అంశం. విపత్తు నిర్వహణ అనేది కేవలం విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కాదు. అసలు పరీక్ష విపత్తు రాకముందే మొదలవుతుంది. ప్రాణనష్టం తగ్గించడానికి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సురక్షిత నిర్మాణాలు, ప్రమాద ప్రాంతాల మ్యాపింగ్, ప్రజలకు అవగాహన, అత్యవసర తరలింపు ప్రణాళికలు, స్థానిక స్థాయిలో శిక్షణ పొందిన సిబ్బంది అవసరం.

నేపాల్‌లోని తాజా పరిణామాలు మరో ముఖ్యమైన వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యం ఒక్క కారణంతో సంభవించదు. భూకంపం, హిమపాతం, కొండచరియలు, ఆకస్మిక వరదలు, నదీ ప్రవాహం వంటి అనేక అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. అందువల్ల విపత్తు నిర్వహణ వ్యవస్థ కూడా అంతే సమగ్రంగా ఉండాలి. ఒక విభాగం భూకంపాన్ని మాత్రమే పర్యవేక్షించడం, మరో విభాగం వాతావరణాన్ని మాత్రమే గమనించడం, ఇంకొక విభాగం నదీ ప్రవాహాన్ని మాత్రమే పరిశీలించడం సరిపోదు. భూకంప శాస్త్రం, వాతావరణ శాస్త్రం, హిమానీనదాల అధ్యయనం, జలవనరుల నిర్వహణ, భౌగోళిక పరిశోధనలు అన్నీ కలిసి పనిచేసే సమగ్ర వ్యవస్థ అవసరం. ముఖ్యంగా హిమాలయ ప్రాంతంలో హిమానీనద సరస్సులు, మంచు నిల్వలు, నదుల ప్రవాహ మార్పులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం పెరుగుతోంది.

ఈ విపత్తులో పర్యాటకుల గల్లంతు కూడా మరో కీలక అంశాన్ని ముందుకు తెస్తోంది. నేపాల్ ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎవరెస్ట్, అన్నపూర్ణ, లాంగ్‌టాంగ్ వంటి పర్వత ప్రాంతాలు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షిస్తాయి. పర్వత సౌందర్యాన్ని ఆస్వాదించడానికి వచ్చే వారు సాధారణంగా ప్రకృతి ప్రమాదాల తీవ్రతను పూర్తిగా అంచనా వేయలేరు. స్థానికులకు తెలిసిన ప్రమాద సంకేతాలు వారికి తెలియకపోవచ్చు. ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడటం లేదా నదీ ప్రవాహం పెరగడం జరిగితే తప్పించుకునే అవకాశం కూడా తక్కువ. అందువల్ల పర్యాటక ప్రాంతాల్లో అత్యవసర హెచ్చరిక వ్యవస్థలు తప్పనిసరి కావాలి. పర్యాటకులు ఏ ప్రాంతానికి వెళ్లినా స్థానిక ప్రమాదాలపై ముందుగానే సమాచారం అందించే విధానం ఉండాలి. పర్వత మార్గాల్లో అత్యవసర ఆశ్రయ కేంద్రాలు, సమాచార కేంద్రాలు, వైద్య సదుపాయాలు, రక్షణ బృందాలు అందుబాటులో ఉండాలి.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రకృతి విపత్తు సమయంలో సమాచార వ్యవస్థ ప్రాణాలను కాపాడగలదు. రహదారులు తెగిపోతే, వంతెనలు కూలిపోతే, విద్యుత్ సరఫరా నిలిచిపోతే సాధారణ సమాచార మార్గాలు పనిచేయకపోవచ్చు. అలాంటి సమయంలో ప్రత్యామ్నాయ సమాచార వ్యవస్థలు ఉండాలి. ఉపగ్రహ ఆధారిత సమాచార పరికరాలు, అత్యవసర రేడియో వ్యవస్థలు, స్థానిక కమ్యూనికేషన్ నెట్‌వర్కులు, డ్రోన్లు, భౌగోళిక సమాచార సాంకేతికత వంటి ఆధునిక సాధనాలను విస్తృతంగా వినియోగించాలి. గల్లంతైన వారి జాడను గుర్తించడంలో డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత మ్యాపింగ్ వంటి సాంకేతికతలు ఎంతో ఉపయోగపడగలవు. అయితే సాంకేతికత ఒక్కటే పరిష్కారం కాదు. స్థానిక ప్రజల అనుభవం, పర్వత ప్రాంతాలపై వారికి ఉన్న అవగాహన కూడా అంతే కీలకం.

ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు మొదటి గంటలు అత్యంత కీలకం. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడంలో, వరదల్లో కొట్టుకుపోయిన వారిని గుర్తించడంలో, గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించడంలో ఆలస్యం ప్రాణాంతకంగా మారుతుంది. అందుకే స్థానిక స్థాయిలోనే వేగంగా స్పందించే బృందాలను ఏర్పాటు చేయాలి. కేవలం రాజధానిలో లేదా ప్రధాన నగరాల్లో ఉన్న రక్షణ బలగాలపై ఆధారపడటం పర్వత ప్రాంతాల్లో సాధ్యం కాదు. ప్రతి ప్రమాద మండలంలో స్థానిక పోలీస్, సైన్యం, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, శిక్షణ పొందిన స్వచ్ఛంద కార్యకర్తలతో కూడిన బృందాలు సిద్ధంగా ఉండాలి. వారికి అవసరమైన పరికరాలు, కమ్యూనికేషన్ సాధనాలు, వైద్య సామగ్రి ముందుగానే అందుబాటులో ఉంచాలి.



నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు స్పందన బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టడం అభినందనీయం. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరులను కాపాడే క్రమంలో భద్రతా సిబ్బంది కూడా గల్లంతవడం వారి సేవ ఎంతటి ప్రమాదకర పరిస్థితుల్లో కొనసాగుతోందో తెలియజేస్తోంది. హెలికాప్టర్ల ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, గాయపడిన వారికి చికిత్స అందించడం, గల్లంతైన వారి కోసం అన్వేషణ కొనసాగించడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. అయితే పర్వత ప్రాంతాల్లో సహాయక చర్యలు స్వయంగా ఒక సవాలే. రహదారులు ధ్వంసం కావడం, వంతెనలు కొట్టుకుపోవడం, వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటం, కొండచరియలు మళ్లీ విరిగిపడే ప్రమాదం ఉండటం వల్ల రక్షణ సిబ్బంది కూడా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

**ఈ సమయంలో భారత్ స్పందన కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. నేపాల్ భారత్‌కు పొరుగుదేశం మాత్రమే కాదు, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక సంబంధాలు కలిగిన దేశం. సరిహద్దు ప్రాంతాల్లో ప్రజల మధ్య బంధాలు ఉన్నాయి. ఇరు దేశాల ప్రజలు తరచుగా పరస్పరం ప్రయాణిస్తుంటారు. అందువల్ల నేపాల్‌లో విపత్తు సంభవించినప్పుడు భారతదేశంలో ఆందోళన వ్యక్తం కావడం సహజం. ముఖ్యంగా గల్లంతైన భారతీయ పర్యాటకుల సంఖ్యపై వస్తున్న సమాచారం మరింత ఆందోళన కలిగిస్తోంది. వారి కుటుంబాలకు స్పష్టమైన సమాచారం అందించడం, గల్లంతైన వారి వివరాలను ధృవీకరించడం, సురక్షితంగా ఉన్న వారిని గుర్తించడం అత్యంత ప్రాధాన్యమైన పని. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు మాత్రమే కాకుండా పర్యాటక సంస్థలు, ప్రయాణ సంస్థలు, స్థానిక యంత్రాంగం పరస్పరం సమన్వయంతో పనిచేయాలి.**

భారత్ అందించే అత్యవసర సహాయం కేవలం మానవతా చర్యగా కాకుండా ప్రాంతీయ సహకారానికి ఒక ఉదాహరణగా ఉండాలి. విపత్తులు సరిహద్దులను గౌరవించవు. హిమాలయాల్లో సంభవించే ప్రకృతి పరిణామాల ప్రభావం ఒక దేశానికే పరిమితం కాదు. నేపాల్‌లో కురిసే భారీ వర్షాలు, మంచు కరుగుదల, నదీ ప్రవాహ మార్పులు దిగువన ఉన్న భారత రాష్ట్రాలపై ప్రభావం చూపుతాయి. నేపాల్ నుంచి ప్రవహించే అనేక నదులు భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. అందువల్ల నదీ ప్రవాహం, వరద హెచ్చరికలు, వాతావరణ సమాచారం వంటి అంశాల్లో భారత్, నేపాల్ మధ్య నిరంతర సమాచార మార్పిడి అవసరం. ఈ విషయంలో విపత్తు ముగిసిన తర్వాత కూడా సహకారం కొనసాగాలి.

నేపాల్‌లో వరదల కారణంగా గండక్ వంటి నదుల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికలు బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు కూడా ఆందోళన కలిగించాయి. ఇదే ప్రాంతీయ విపత్తు నిర్వహణ అవసరాన్ని స్పష్టం చేస్తోంది. ఒక దేశంలో జరిగిన ప్రకృతి పరిణామం మరొక దేశంలో వరద ముప్పుగా మారవచ్చు. కాబట్టి నదీ పరివాహక ప్రాంతాలను దేశాల సరిహద్దులతో విడదీసి చూడలేం. నది ఎక్కడ పుడుతోంది, ఎక్కడ ప్రవహిస్తోంది, ఎక్కడ కలుస్తోంది అనే మొత్తం భౌగోళిక వ్యవస్థను పరిగణనలోకి తీసుకోవాలి. పైప్రాంతంలో వర్షపాతం లేదా మంచు కరుగుదల పెరిగినప్పుడు దిగువ ప్రాంతాలకు ముందస్తు సమాచారం చేరేలా సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలి. ప్రజలను చివరి నిమిషంలో కాకుండా గంటల ముందే సురక్షిత ప్రాంతాలకు తరలించగలిగితే ప్రాణనష్టం గణనీయంగా తగ్గించవచ్చు.

ప్రస్తుత ప్రపంచంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా ఈ విపత్తుల నేపథ్యంలో విస్మరించలేం. హిమాలయాలు వేగంగా మారుతున్న పర్యావరణ వ్యవస్థ. మంచు, హిమానీనదాలు, నదులు, అడవులు, పర్వత నేలల మధ్య ఉన్న సమతుల్యతలో మార్పులు ప్రమాదాలను పెంచుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల హిమానీనదాలపై ప్రభావం పడుతుంది. మంచు కరుగుదల, హిమానీనద సరస్సుల విస్తరణ, కొండచరియల అస్థిరత వంటి అంశాలు పర్వత ప్రాంతాల భద్రతకు సవాలుగా మారుతున్నాయి. దీనికి తోడు అటవీ నరికివేత, నియంత్రణలేని రహదారి నిర్మాణం, పర్వతాలను కోసి నిర్మాణాలు చేపట్టడం, నదీ తీరాల్లో అడ్డగోలుగా నిర్మాణాలు చేయడం ప్రమాదాన్ని మరింత పెంచుతాయి. ప్రకృతి విపత్తును పూర్తిగా నివారించడం మన చేతుల్లో లేకపోయినా, మానవ తప్పిదాల వల్ల దాని ప్రభావం పెరగకుండా చూడటం మాత్రం సాధ్యమే.

అభివృద్ధి అవసరమే. నేపాల్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక సదుపాయాలు, నివాసాలు అవసరం. కానీ అభివృద్ధి ప్రకృతి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సాగితే అదే అభివృద్ధి భవిష్యత్తులో విపత్తుగా మారుతుంది. పర్వతాలను విచక్షణారహితంగా కోయడం, నదీ ప్రవాహ మార్గాలను ఆక్రమించడం, ప్రమాదకర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం, భూకంప నిరోధక ప్రమాణాలను పట్టించుకోకపోవడం వంటి చర్యలకు మూల్యం చివరకు ప్రజలే చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి పర్వత ప్రాంతాల్లో ప్రతి రహదారి, ప్రతి వంతెన, ప్రతి జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు పర్యావరణ, భౌగోళిక ప్రమాదాలపై కఠినమైన అధ్యయనం తప్పనిసరి కావాలి.

జలవిద్యుత్ ప్రాజెక్టులు నేపాల్ ఆర్థిక భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమైనవి. నదుల ప్రవాహం, పర్వతాల సహజ వాలును ఉపయోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయడం ఆ దేశానికి పెద్ద అవకాశాన్ని కల్పిస్తుంది. కానీ ప్రాజెక్టుల సంఖ్య పెంచడమే అభివృద్ధి కాదు. వాటి భద్రత, నిర్మాణ నాణ్యత, అత్యవసర నీటి విడుదల విధానం, భూకంప నిరోధకత, వరదల సమయంలో రక్షణ చర్యలు వంటి అంశాలను కూడా సమానంగా పరిగణించాలి. ఒక ప్రాజెక్టు దెబ్బతింటే దాని ప్రభావం కేవలం విద్యుత్ ఉత్పత్తిపైనే కాకుండా దిగువ ప్రాంతాల ప్రజలపై కూడా పడవచ్చు. కాబట్టి ప్రతి ప్రాజెక్టుకు ప్రమాద నిర్వహణ ప్రణాళిక ఉండాలి.

అదేవిధంగా పర్వత రహదారుల విషయంలో కూడా కొత్త ఆలోచన అవసరం. కొండలను కోసి రహదారులు నిర్మించడం వల్ల తాత్కాలికంగా ప్రయాణ సౌకర్యం పెరిగినా, దీర్ఘకాలంలో కొండచరియల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుంది. రహదారి నిర్మాణంలో శాస్త్రీయ పద్ధతులు, డ్రైనేజీ వ్యవస్థలు, రిటైనింగ్ వాల్స్, భూసార సంరక్షణ చర్యలు తప్పనిసరి కావాలి. ఒక రహదారి తెగిపోతే గ్రామాలు, పర్యాటక ప్రాంతాలు, ఆస్పత్రులు, మార్కెట్లు ప్రపంచంతో సంబంధం కోల్పోయే పరిస్థితి ఏర్పడకూడదు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర హెలిప్యాడ్లు, రక్షణ కేంద్రాలు ముందుగానే సిద్ధం చేయాలి.

ఈ విపత్తు మనకు మరో పాఠాన్ని చెబుతోంది. ప్రకృతిని జయించగలమన్న మానవ అహంకారం ఎంత ప్రమాదకరమో ఇది గుర్తుచేస్తోంది. మనిషి సాంకేతికతలో ఎంత పురోగతి సాధించినా పర్వతం కదిలితే, నది ఉప్పొంగితే, మంచు విరిగిపడితే, భూమి కంపిస్తే మన నిర్మాణాల బలహీనత బయటపడుతుంది. అందుకే ప్రకృతితో పోరాడే అభివృద్ధి కంటే ప్రకృతితో సహజీవనం చేసే అభివృద్ధి అవసరం. పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవన విధానాన్ని, సంప్రదాయ జ్ఞానాన్ని, స్థానిక పర్యావరణాన్ని గౌరవించే విధానాలు రూపొందించాలి.

విపత్తు సమయంలో సామాజిక మాధ్యమాలు కూడా రెండు వైపుల కత్తిలా మారుతున్నాయి. ఒకవైపు వరదలు, కూలిన భవనాలు, చిక్కుకున్న ప్రజల దృశ్యాలు ప్రపంచానికి వేగంగా చేరుతున్నాయి. మరోవైపు ధృవీకరించని గణాంకాలు, పాత వీడియోలు, తప్పుదారి పట్టించే సమాచారం కూడా వైరల్ అవుతోంది. గల్లంతైన వారి కుటుంబాలు ఇప్పటికే ఆందోళనలో ఉన్న సమయంలో తప్పుడు వార్తలు మరింత భయాన్ని పెంచుతాయి. కాబట్టి అధికారిక సమాచార వ్యవస్థ బలంగా ఉండాలి. మృతులు, గల్లంతైన వారు, రక్షించబడిన వారు, చికిత్స పొందుతున్న వారి వివరాలను క్రమం తప్పకుండా నవీకరించాలి. మీడియా సంస్థలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనానికి మించి నిజానిజాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించడం, గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించడం, గల్లంతైన వారి కోసం శోధన కొనసాగించడం మొదటి బాధ్యత. కానీ అంతటితో ప్రభుత్వాల బాధ్యత ముగియదు. విపత్తు తర్వాత పునరావాసం మరింత కఠినమైన దశ. ఇళ్లు కోల్పోయిన వారికి నివాసం, ఉపాధి కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం, పిల్లల విద్యకు ఏర్పాట్లు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, పాఠశాలలు, ఆస్పత్రుల పునర్నిర్మాణం వంటి పనులు నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు. ఈ పునర్నిర్మాణం కూడా పాత నమూనాలో జరగకూడదు. గతంలో ప్రమాదానికి గురైన ప్రాంతంలో అదే తరహా నిర్మాణాలు మళ్లీ చేపడితే మరో విపత్తు వచ్చినప్పుడు అదే నష్టం పునరావృతమవుతుంది. పునర్నిర్మాణం అంటే కేవలం కూలినదాన్ని తిరిగి నిర్మించడం కాదు; మరింత సురక్షితమైన భవిష్యత్తును నిర్మించడం.

ప్రకృతి విపత్తుల నుంచి బయటపడిన సమాజాల్లో మానసిక గాయం కూడా తీవ్రంగానే ఉంటుంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు, తమ ఇళ్లు నాశనం అయిన వారు, గంటల తరబడి ప్రాణభయంతో గడిపిన వారు సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. పిల్లలు ముఖ్యంగా తీవ్ర భయానికి గురయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి సహాయక చర్యల్లో మానసిక ఆరోగ్య సహాయాన్ని కూడా భాగం చేయాలి. బాధితులకు కేవలం ఆహారం, నీరు, మందులు అందించడం మాత్రమే కాకుండా, వారి భయాలు, ఆందోళనలు, భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితిని ఎదుర్కొనేలా సహాయం చేయాలి.

నేపాల్ విపత్తు హిమాలయ ప్రాంతంలోని ఇతర దేశాలకు కూడా ముందస్తు హెచ్చరికగా నిలవాలి. భారతదేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ వంటి పర్వత ప్రాంతాలు కూడా భూకంపాలు, కొండచరియలు, ఆకస్మిక వరదలు, హిమానీనదాల మార్పులకు సున్నితమైన ప్రాంతాలే. అక్కడ కూడా పర్యాటకం, రహదారి నిర్మాణం, జలవిద్యుత్ ప్రాజెక్టులు వేగంగా పెరుగుతున్నాయి. అభివృద్ధిని ఆపేయడం పరిష్కారం కాదు. కానీ ప్రమాదాన్ని అంచనా వేసి, శాస్త్రీయంగా, పర్యావరణ సమతుల్యతతో అభివృద్ధి చేయడం తప్పనిసరి. ఒక ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని మరో ప్రాంతం పాఠంగా తీసుకోవాలి. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సిద్ధపడటం ఎప్పుడూ చౌక, సులభం, మానవీయమైన మార్గం.

హిమాలయ ప్రాంతానికి ప్రత్యేకమైన ప్రాంతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చింది. భారత్, నేపాల్, భూటాన్, చైనా వంటి దేశాల మధ్య శాస్త్రీయ సమాచారం పంచుకునే వ్యవస్థ ఉండాలి. భూకంపాల పర్యవేక్షణ, హిమానీనదాల మార్పులు, వాతావరణ పరిస్థితులు, నదీ ప్రవాహాలు, కొండచరియల ప్రమాద ప్రాంతాలపై సమాచారాన్ని వీలైనంత వేగంగా పరస్పరం పంచుకోవాలి. రాజకీయ విభేదాలు ఏవైనా ఉండొచ్చు; కానీ ప్రకృతి ప్రమాదాల విషయంలో మానవ ప్రాణాల రక్షణకు సహకారం అత్యున్నత ప్రాధాన్యం పొందాలి. సరిహద్దులు ప్రకృతి వ్యవస్థలకు ఉండవు. కాబట్టి విపత్తు నిర్వహణకూ సరిహద్దులకతీత దృక్పథం అవసరం.

నేపాల్‌లో తాజా విషాదం మరోసారి నిరూపించిన విషయం ఏమిటంటే విపత్తు నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ శాఖల పని కాదు. ప్రజలు కూడా దాని భాగస్వాములు కావాలి. పాఠశాలల్లో భూకంప సమయంలో ఎలా స్పందించాలి, వరద వచ్చినప్పుడు ఏ దిశలో వెళ్లాలి, కొండచరియల ప్రమాద సంకేతాలు ఏమిటి వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలి. పర్యాటకులకు కూడా ప్రమాద ప్రాంతాలపై తప్పనిసరి అవగాహన కల్పించాలి. గ్రామస్థాయిలో అత్యవసర సమావేశ స్థలాలు గుర్తించాలి. కుటుంబాలు కనీస అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలి. స్థానిక సంస్థలు తరచుగా మాక్ డ్రిల్లులు నిర్వహించాలి. విపత్తు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కోసం ఎదురు చూసే పరిస్థితి కాకుండా, మొదటి కొన్ని గంటల్లో తాము చేయగల సహాయం చేసుకునే సామర్థ్యం సమాజానికి ఉండాలి.

ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి వెనుక ఒక కుటుంబం ఉంది. గల్లంతైన ప్రతి వ్యక్తి కోసం ఒక కుటుంబం ఇంకా ఆశతో ఎదురు చూస్తోంది. ప్రకృతి విపత్తుల గణాంకాలను కేవలం సంఖ్యలుగా చూడటం సులభం. కానీ ఆ సంఖ్యల వెనుక ఉన్న మానవ విషాదాన్ని గుర్తించడం మరింత అవసరం. 157 మంది, వందలాది మంది గల్లంతు, వందలాది కుటుంబాల నిరీక్షణ వంటి సంఖ్యలు మనకు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. విపత్తు ప్రభావాన్ని తగ్గించడంలో ప్రతి ప్రాణం విలువైనదే. ముందస్తు హెచ్చరికతో ఒక వ్యక్తిని కాపాడగలిగితే అది కూడా విజయమే. సురక్షిత నిర్మాణంతో ఒక కుటుంబాన్ని రక్షించగలిగితే అదే నిజమైన అభివృద్ధి.

ప్రకృతి ప్రకోపాన్ని పూర్తిగా ఆపడం మానవ శక్తికి సాధ్యం కాకపోవచ్చు. భూకంపం ఎప్పుడు వస్తుందో ఖచ్చితంగా చెప్పలేం. కొండచరియ ఎప్పుడు విరిగిపడుతుందో ముందే నిర్ధారించడం కష్టం. కానీ ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించవచ్చు. బలహీన నిర్మాణాలను బలోపేతం చేయవచ్చు. నదీ ప్రవాహాన్ని పర్యవేక్షించవచ్చు. హిమానీనదాల మార్పులను గమనించవచ్చు. ముందస్తు హెచ్చరికలు జారీ చేయవచ్చు. ప్రజలను సకాలంలో తరలించవచ్చు. అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచవచ్చు. ఇవన్నీ చేయగలిగితే ప్రకృతి విపత్తు విరుచుకుపడినప్పటికీ దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

నేపాల్ ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాలు కేవలం సహాయక చర్యలతో ముగిసేది కాదు. ఇది ఆ దేశ అభివృద్ధి విధానాన్ని పునరాలోచించాల్సిన సందర్భం. పర్వత ప్రాంతాల్లో ఎక్కడ నిర్మించాలి, ఎక్కడ నిర్మించకూడదు, ఎలాంటి రహదారులు వేయాలి, ఎలాంటి జలవిద్యుత్ ప్రాజెక్టులు చేపట్టాలి, పర్యాటకాన్ని ఎంతవరకు విస్తరించాలి, హిమానీనదాల మార్పులను ఎలా పర్యవేక్షించాలి, భూకంప నిరోధక ప్రమాణాలను ఎలా కఠినతరం చేయాలి వంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. ఈ ప్రశ్నలకు రాజకీయ ప్రయోజనాల కంటే శాస్త్రీయ ఆధారాలు ప్రాతిపదిక కావాలి.

**విపత్తు తర్వాత వచ్చే సానుభూతి కొంతకాలమే ఉంటుంది. ప్రపంచ దేశాలు సహాయం చేస్తాయి. మీడియా వార్తలు ప్రసారం చేస్తుంది. ప్రజలు విరాళాలు ఇస్తారు. కొంతకాలానికి వార్తలు మరుగునపడతాయి. కానీ బాధిత కుటుంబాల జీవితం మాత్రం అక్కడితో ముగియదు. వారు కోల్పోయిన వారిని తిరిగి పొందలేరు. కాబట్టి పునరావాసం దీర్ఘకాలికంగా కొనసాగాలి. అంతకంటే ముఖ్యంగా తదుపరి విపత్తులో ఇంతటి ప్రాణనష్టం జరగకుండా వ్యవస్థలను మార్చాలి. ప్రతి విపత్తు తర్వాత ఒక సమగ్ర అధ్యయనం చేసి, ఏ తప్పిదాల వల్ల నష్టం పెరిగిందో గుర్తించి, వాటిని సరిదిద్దడం ప్రభుత్వాల బాధ్యత. నేపాల్ విషాదం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రకృతి హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి ఎంత వేగంగా సాగినా అది నిలబడదు. పర్వతాలను గౌరవించాలి. నదుల సహజ ప్రవాహాలను గౌరవించాలి. హిమానీనదాల సున్నితత్వాన్ని అర్థం చేసుకోవాలి. భూకంప ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టాలి. పర్యాటక అభివృద్ధికి భద్రతను జోడించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందస్తు హెచ్చరికలకు వినియోగించాలి. దేశాల మధ్య సమాచార భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రజలకు విపత్తు అవగాహన కల్పించాలి. ఇవన్నీ కలిసినప్పుడే హిమాలయ ప్రాంతానికి సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుంది.**

# మహాదేవపురం రెవెన్యూ సమస్య పరిష్కారానికి చర్యలు

## రెవెన్యూ మంత్రిని కలిసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 11 (అరుణ ప్రభ) మహాదేవపురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి రాష్ట్ర రెవెన్యూ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిను కలిసి వినతిపత్రం సమర్పించారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ కొలను హనుమంత్ రెడ్డి, మహాదేవపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ సిద్ధనోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు మంత్రిని కలిసి మహాదేవపురం రెవెన్యూ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యకు సంబంధించిన వివరాలను మంత్రికి వివరించి, కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు.

### కలెక్టర్‌కు మంత్రి ఫోన్

కాలనీ వాసులు సమర్పించిన వినతిపత్రంపై రెవెన్యూ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమస్య తీవ్రతను తెలుసుకునేందుకు మేడ్చల్––మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మహాదేవపురం రెవెన్యూ సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

### త్వరలో పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం

రెవెన్యూ సమస్యపై మంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడటంపై మహాదేవపురం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టి, కాలనీ వాసులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం కాలనీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రామచంద్ర రెడ్డితో పాటు ప్రవీణ్, నవీన్ రావు, దిలీప్, వి.వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రావు, నరేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాదేవపురం కాలనీ రెవెన్యూ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని కాలనీ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






# నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశంలో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, రైతుల సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు తదితర అంశాలపై అధికారులు, సర్పంచులతో ఎమ్మెల్యే గారు సమీక్షించారు. గ్రామాల నుంచి సర్పంచులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి, ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే గారు మాట్లాడి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే గారు సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనం వారికి అందేలా చూడాలని అన్నారు. రైతులకు సంబంధించిన సమస్యలు, రోడ్ల అభివృద్ధి, విద్యా సంస్థలు, వైద్య సేవలు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గారు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్,మండల ప్రజాప్రతినిధులు,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వం ఉద్యోగుల, పెన్షనర్స్ రెండవ పీఆర్‌సీ మరియు పెండింగులో ఉన్న 6 డీఏలు వెంటనే మంజూరు చేయాలి

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల, పెన్షనర్స్ జీత, భత్యాలు, పెండింగు బిల్లులు, పీఆర్‌సీ మరియు 6 డీఏలు మంజూరు విషయంలో మూడు సంవత్సరాలు పెండింగులో పెట్టడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామని ఈ రోజు జరిగిన పెన్షనర్స్ టీ.జీ.ఈ.జేఏసీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ కార్యవర్గం, సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్నామని అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఇజాక్, పడమటి శాంతకుమారి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణ రెడ్డి, కార్యవర్గం సభ్యులు, సభ్యులు పాల్గొని నిరసన తెలియజేశారు.

# ఆదివాసి బిడ్డ ఉకే శిరీష ను హత్య చేసి అత్యాచారం జరిపిన కామాంధుడుని కఠినంగా శిక్షించాలి

## తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కిషన్ నాయక్

అరుణప్రభ 1 సెప్టెంబర్ మహబూబాబాద్ మహబూబాబాద్ పట్టణంలోని కొమరం భీం విగ్రహం ఎదుట గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో దళిత గిరిజన ప్రజా విద్యార్థిసంఘాలు మహిళా సంఘాలు హైదరాబాద్ తుక్కుగూడలోని ప్రైవేటు హాస్పటల్ లో నర్సుగా పనిచేస్తున్న గిరిజన ఆదివాసి బిడ్డపై క్రూర మృగంగా సమీప మెకానిక్ షాపులో పనిచేస్తున్న బీహార్ కు చెందిన సైనా ఉల్లా ఖాన్ ఒంటరిగా ఉన్న శిరీష రూమ్ లోకి ప్రవేశించి ఆమెపై అత్యాచారం జరిపి బలవంతంగా కొట్టడం క్రూరంగా హత్య చేసి మానభంగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జీవనోపాధి కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి పరిది లోని చెవిటి గూడెం నుంచి తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆమె మీద ఇలాంటి అత్యాచారం హత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. అతికిరాతకంగా అత్యాచారం కిరాతకంగా చంపిన నిందితుడిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సామ పాపన్న. ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వట్టం భాగ్యమ్మ. పోలేపాక వెంకన్న, భూర్క జయమ్మ వాసం జయసుధ గట్టి యాకలక్ష్మి చింత ధనలక్ష్మి అజ్మీర రామ్ కూమారి, సుజాత, డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్య ప్రకాష్, సాయికుమార్, దేవేందర్, కే సత్యనారాయణ తదితరులు పాల్గొని, శిరీష చిత్రపటానికి నివాళులర్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# సీసీ కెమెరాలు ఏర్పాటుకై రెండు లక్షల 50 వేల విరాళం అందజేత



అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 1,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండలంలోని వావిల్ కోల్ ,రుద్రాయ గూడెం గ్రామపంచాయతీ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుటకై రుద్రాయగూడెం గ్రామస్తుడైన దొంతినేని రాజేశ్వరరావు రెండు లక్షల 50 వేల రూపాయలను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డిండి ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ, గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు . నేర నియంత్రణ మరియు నేరాలను కనిపెట్టడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇదే తరహాలో అన్ని గ్రామాలలో కూడా సీసీ కెమెరాలు ప్రజల సహకారంతో ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రజిత జంగారెడ్డి, ఇతర గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు గ్రామంలో పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్లు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథం లో సిఎం చంద్ర బాబు నాయుడు నడిపిస్తున్నాడని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో మల్లి శ్యామల , ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, అల్లం కిష్టయ్య, అంకమ్మ, మౌనిక , తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు పశు గ్రాసాన్ని 50 శాతం రాయితీతో మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ సుధీర్ , పాడి రైతులు , తదితరులు పాల్గొన్నారు



# మూడో రోజు కొనసాగుతున్న టి.సి.ఎల్

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని అల్లూరి ప్రభుత్వ స్టేడియంలో బుధవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ 'టీచర్స్ క్రికెట్ లీగ్'మూడవ రోజు పోటీలు అత్యంత కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దశరథరామిరెడ్డి, బాలాజీ కాలేజీ ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి, హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం అందించడంలో క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. నిరంతర పాఠ్యాంశ బోధన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవడానికి ఇటువంటి లీగ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 మండలాల నుంచి ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఇంత భారీ స్థాయిలో టోర్నమెంట్‌ను నిర్వహించడం ప్రగతి సేవా సంస్థ యొక్క గొప్పతనానికి, వారి అద్భుతమైన నిర్వహణ ప్రతిభకు నిదర్శనం అని కొనియాడారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడారంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్న ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ను అభినందించారు .



# ఘన సన్మానం

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం నందు ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రంగా చార్యులు బదిలీ అయ్యారు. దీనితో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ప్రధానోపాధ్యురాలిగా రోహిణి బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతరం శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాల తరపున పాఠశాల కార్యదర్శి శ్రీ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ కమిటీ సభ్యులు సనత్ కుమార్ , రామ మోహన్ , ఆర్ వి రావు అశోక్ కుమార్ రవిచంద్ర చేతుల మీదగా ఘనంగా సత్కరించారు .

# సెప్టెంబర్ 1న 'పెన్షన్ విద్రోహ దినం'గా ఉద్యోగుల భారీ నిరసన

**సీపీఎస్ రద్దు చేసి ఒపి ఎస్ పునరుద్ధరించాలి**

**రెండవ పీఆర్సీ ప్రకటించాలి పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి**

**ఉద్యోగ సంఘాల నాయకుల ధర్నాతో దద్దరిల్లిన మానుకోట కలెక్టరేట్**




అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 1: ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్ )ను పునరుద్ధరించడంతో పాటు, సి పి ఎస్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర టీజీజాక్ పిలుపు మేరకు మహబూబాబాద్‌లో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 1వ తేదీని రాష్ట్రవ్యాప్తంగా 'పెన్షన్ విద్రోహ దినం'గా పాటిస్తూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగి తన జీవితంలో అత్యంత విలువైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేసి, ప్రజలకు సేవ చేసిన అనంతరం పదవీ విరమణ పొందే సమయంలో అతని కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే సి పి ఎస్ విధానం కారణంగా పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు స్థిరమైన ఆర్థిక భద్రతపై అనిశ్చితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఒపిఎస్ పునరుద్ధరణే ఉద్యోగుల ప్రధాన డిమాండ్ -- టీజీజాక్ చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్**

టీజీజాక్ చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగులు తమ జీవితంలో అత్యంత విలువైన సంవత్సరాలను ప్రభుత్వ సేవకు అంకితం చేస్తున్నారని, అలాంటి ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన, భద్రమైన జీవితం కల్పించేందుకు ఒపి ఎస్ ఎంతో కీలకమన్నారు. సీపీఎస్ విధానం ఉద్యోగుల్లో భవిష్యత్తుపై ఆందోళనకు కారణమవుతోందని తెలిపారు. ఉద్యోగుల పెన్షన్ భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఒపి ఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర టీజీజాక్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి -- టీజీజాక్ కన్వీనర్ మహమ్మద్ రఫీ**

టీజీజాక్ కన్వీనర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, ఉద్యోగుల భవిష్యత్తు భద్రతతో పాటు ప్రస్తుత ఆర్థిక సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సి పి ఎస్ ను రద్దు చేసి ఒ పి ఎస్ ను పునరుద్ధరించడంతో పాటు, ఉద్యోగులకు సంబంధించిన రెండవ పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని కోరారు అలాగే ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను తక్షణమే ప్రకటించి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సానుకూలంగా స్పందించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ సందర్భంగా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ, పెన్షన్ అనేది ఉద్యోగి భవిష్యత్తుకు భద్రత మాత్రమే కాకుండా, జీవితాంతం ప్రభుత్వ సేవ చేసిన ఉద్యోగికి లభించాల్సిన సామాజిక భద్రత అని పేర్కొన్నారు. ఉద్యోగి పదవీ విరమణ అనంతరం తన కుటుంబ అవసరాలు, పిల్లల బాధ్యతలు, వృద్ధాప్య జీవితం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సీపీఎస్ లో కొనసాగుతున్న ఉద్యోగులకు భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక అనిశ్చితిపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఉద్యోగుల ఆందోళనలను అర్థం చేసుకుని ఒపి ఎస్ పునరుద్ధరణపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు

అలాగే రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని అన్నారు. రెండవ పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయడం, పెండింగ్ డీఏలను విడుదల చేయడం, ఉద్యోగులకు రావాల్సిన ఇతర ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడం ద్వారా ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు

ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే, రాష్ట్ర టీజీజాక్ పిలుపు మేరకు భవిష్యత్తులో చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉద్యోగ సంఘాలు ఐక్యంగా పనిచేస్తాయని నాయకులు స్పష్టం చేశారు.

ఉద్యోగుల ఐక్యతతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తాం

ఉద్యోగుల భవిష్యత్తు భద్రత, పెన్షన్ హక్కు, న్యాయమైన ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం చేపట్టిన ఈ ఉద్యమాన్ని ఉద్యోగులు ఐక్యంగా ముందుకు తీసుకెళ్తారని నాయకులు తెలిపారు. సి పి ఎస్ రద్దు -- ఓ పి ఎస్ పునరుద్ధరణ, రెండవ పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం అవసరమైనంత వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు

ఈ కార్యక్రమంలో ఎ. మురళీకృష్ణ (యూ టి ఎఫ్ ), మహమ్మద్ ఫెరోజ్ (ట్రెసా ), బి. రమేష్ (టీపీటీఎఫ్ ), వేల్పుల శ్రీనివాస్ (టి జి ఓ ), మైస రోహిత్ (టీ ఎన్ జి ఓ ), జి. ప్రసాద్ (ఎస్ టి యు టి ఎస్ ), లక్ష్మి (నల్గొవా తరగతి ), బి. వెంకన్న (టీ టి ఎన్ జి ఓ ), దేవేందర్ రాజు (డీటీఎఫ్ ), మైసా నాగయ్య (పెన్షనర్ల యూనియన్ ), వి. సత్యనారాయణ (టీ ఆర్ టి ), కిరణ్ సింగ్ (టీ ఆర్ టి ) తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

"సీపీఎస్ రద్దు -- ఒ పి ఎస్ పునరుద్ధరణ సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది" అని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

# దేవరకొండ నియోజకవర్గంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ






అరుణ ప్రభ, దేవనకొండ డివిజన్, సెప్టెంబర్ 1,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.దేవరకొండ పట్టణంలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కొత్త రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టిందని తెలిపారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో బి ఆర్ఎస్ కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురు చూసిన ఫలితం లేదని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ పేదలకు సన్న బియ్యం, పంపిణీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,గృహ అవసరాలకు ఉచిత విద్యుత్ ,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ,ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు, కొత్త రేషన్ కార్డులు, రైతు సంక్షేమ కార్యక్రమాలు ,మహిళా సంక్షేమ పథకాలు తదితర అనేక కార్యక్రమాలను ప్రభుత్వ అమలు చేస్తుందని గుర్తు చేశారు .వెయ్యి రోజుల్లో కేసీఆర్ చేసింది ఏమిటి ,ప్రజలకు దూరంగా ఉంటూ 22 కోట్ల రూపాయల మేర జీతాలు తీసుకున్నారని బాలునాయక్ విమర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ,జాయింట్ కలెక్టర్ జె శ్రీనివాస్ ,ఆర్డిఓ పద్మప్రియ ,దేవరకొండ మున్సిపల్ చైర్పర్సన్ శైలజ వెంకటేశ్వర్లు ,మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, వెంకటయ్య గౌడ్, వెంకటేష్ గౌడ్, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు ,కౌన్సిలర్లు, సర్పంచులు ,కాంగ్రెస్ నాయకులు ,అన్ని మండలాల తహసీల్దారులు, సివిల్ సప్లై అధికారులు, ప్రజాప్రతినిధులు రేషన్ డీలర్లు ,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్‌నగర్‌కాలనీలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ వేడుకలు

**సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం హనుమాన్ నగర్ కాలనీలో**

**వైబోపేతంగా దుర్గమ్మ. పోచమ్మ బోనాల ఉత్సవాల ఊరేగింపు...**

**పోతురాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాలు...**



అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి : శ్రీ దుర్గమ్మ.పోచమ్మ తల్లి అమ్మ వార్ల కృపతో ప్రజలం దరినీ చల్లంగా చూడాలని భక్తులు . కోరుకున్నారు మంగళవారం నాడు పట్టణంలోని హను మాన్ నగర్ కాలనీలో మహిళా భక్తులు సామూహిక బోనాల ఉత్సవాలను నిర్వహించారు ఈ వ్యాసాలు ఉత్సవాలలో డప్పు వాయిద్యాలు . పోతురాజు విన్యాసాలు. శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఉత్సవాలను వైభోపేతంగా నిర్వహించారు. తదుపరి అమ్మవార్లకు బోనం సమర్పించి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద్ వితరణ చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ శ్రీనివాస్.గౌడ్ 8వ వార్డు కొత్త గొల్ల సోమశేఖర్ మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ దుర్గమ్మ పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న కాలనీ ప్రజలకు. వివిధ పార్టీ నాయకులకు ఆ అమ్మవారి కృప తో చల్లగా చూడాలని. ఈ ధార్మిక కార్యక్రమాలను చేసినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్. కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్. కొత్త గొల్ల చంద్రశేఖర్. మల్లేశం. సర్పంచ్ ఆశి రెడ్డి.రమేష్ గౌడ్. రామచంద్ర. కె ప్రవీణ్ కుమార్. వీరన్న పటేల్. కూచిని సతీష్ .రత్నాకర్ రెడ్డి. శ్రీనివాస్. సిహెచ్ సత్యనారాయణ. రవి. శ్రీనివాస్. వీరేశం టీచర్ శివకోటి స్వామి తదితరలు మహిళా భక్తులు పాల్గొన్నారు.



# ఐదు నెలలుగా జీతాలు లేక వాటర్‌స్కీమ్ కార్మికుల అవస్థలు

**అధికారులతో మాట్లాడిన బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్‌బాబు**

ధర్మవరం, సెప్టెంబర్ 1 (అరుణ ప్రభ న్యూస్): శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్ (ఎస్. ఎస్. ఎస్. డబ్ల్యూ. ఎస్. పి) లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు అందక ఇబ్బం దులు పడుతున్న విషయం బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు దృష్టికి వచ్చింది. నిమ్మలకుంట లో కార్మికుల యూనియన్ ప్రతినిధులు ఆయనను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన హరీష్‌బాబు వెంటనే ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ సీఈవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ వేతనాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరా వంటి కీలక సేవల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి జీతాలు అందకపోవడం సరికాదన్నారు. అవసరమైతే ఈ విషయాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి ఉన్నతస్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హరీష్‌బాబు కార్మికులకు హామీ ఇచ్చారు.



## పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి: సన్మాన సభలో శంకర్ నాయక్

అరుణప్రభ 1 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : పదవీ విరమణ పొందిన ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన మహబూబాబాద్ రవాణా శాఖ అధికారులు కార్యాలయ సిబ్బంది ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఎన్ని సంవత్సరాలు అంకితభావంతో ఉద్యోగాన్ని నిర్వహించినందుకు శు భాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించిన కానిస్టేబుల్‌ను శాలువాతో సన్మానించిన అధికారులు, సిబ్బంది

**పూలు చల్లుతూ ఆత్మీయంగా వీడ్కోలు..**

పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించిన సిబ్బంది..



## బోడుప్పల్‌లో బిఆర్ఎస్ ఉద్యమ నాయకుడు తాల్క శత్రుజ్ఞ జన్మదిన వేడుకలు

**శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన పాత్రికేయ మిత్రులు**

**ప్రజా సమస్యల పరిష్కారానికి, ఉద్యమానికి శత్రుజ్ఞ చేసిన సేవలు అభినందనీయం**

సెప్టెంబర్ 01,అరుణ ప్రభ : తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని,ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న బి ఆర్ ఎస్ ఉద్యమ నాయకుడు తాల్క శత్రుజ్ఞ జన్మదిన వేడుకలు బోడుప్పల్‌లో మంగళవారం నాడు అత్యంత ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు,పాత్రికేయ మిత్రులు,కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.వేడుకల్లో భాగంగా పాత్రికేయ మిత్రులు తాల్క శత్రుజ్ఞను పూలమాలలు,శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఉద్యమ కాలం నుండి నేటి వరకు ప్రజల పక్షాన నిలుస్తూ శత్రుజ్ఞ అందిస్తున్న సేవలు కొనియాడదగినవని పేర్కొన్నారు.నిరంతరం ప్రజల్లో ఉంటూ సామాజిక శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనకు భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు,పాల్గొన్నారు.



## పసుపుల శ్రీనివాస్ మృతి బాధాకరం

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి.**

అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 1 ,దిండి మండల పరిధిలోని గోనబోయినపల్లి గ్రామ సిపిఐ గ్రామ శాఖ సభ్యులు పసుపులేటి శ్రీనివాస్ మృతి బాధాకరమని ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూమ్ బుచ్చిరెడ్డి అన్నారు.మంగళవారం గోనబోయినపల్లి గ్రామంలో పసుపులేటి శ్రీనివాస్ పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు అర్పించారు.వారి కుటుంబ సభ్యులకు పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపారు.కమ్యూనిస్టు పార్టీలో కడవరకు సాగిన శ్రీనివాస్ జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, మండల సహాయ కార్యదర్శి తిప్పర్తి విజయేందర్ రెడ్డి, సిపిఐ శాఖ కార్యదర్శి బాల్నారి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి సమృద్ధిగా తీసుకెళ్లాలి

**బెల్లంకొండను సన్మానించిన రాజ్యసభ సభ్యుడు వీఎమ్ నరేందర్ రెడ్డి**

అరుణప్రభ 1 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలుపరిచిందని ఇట్టి పథకాల అమలును సమృద్ధిగా ప్రజల చెంతకు చేర్చే బాధ్యత మండల అధ్యక్షులకు న్నదని నూతనంగా ఎన్నికైన మానుకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసును సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపి ఆ విధంగా సూచించారు

# ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

**మానవీయ కోణంలో సేవలు అందించాలి**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీలో సమీక్ష సమావేశం**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ జిల్లా పర్యటనకు రాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె స్వాగతం పలికి.. పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డు కలిగిఉన్న ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పని వివరాలను అధికారుల ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు ఛార్జ్ షీట్ దాఖలు వివరాలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదయిన కేసుల దర్యాప్తు త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారం అందేవిధంగా చూడాలని వివరించారు. ప్రతినెలా చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ సమావేశాల్లో పాల్గొని, ప్రజల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలు, చట్టాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు.





ఖచ్చితంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఏవైనా అభివృద్ధికి సంబంధించి నిధులు పెండింగ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల అయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభ్యున్నతితో పాటు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా మరింత కృషి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లోని పారిశుధ్య కార్మికులకు ఎస్ బీ ఐ బ్యాంక్ ఖాతాలు తీయించాలని, దీంతో కార్మికులకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ కు అభినందన**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సేవలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించారు. జిల్లా కలెక్టర్ అందరికీ ఒకే న్యాయం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న ఉత్తమ సేవలను కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారుల సేవలను అభినందించారు. జిల్లా ఎస్పీ మహేశ్ బి గితె మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు తెలియజేశారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. వివిధ దశల్లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం కలిగేలా చూస్తామని అన్నారు. కేసుల దర్యాప్తు పారదర్శకంగా చేపడతామని తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ కింద జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు 2,315 మంది ఎస్సీలు, 436 మంది ఎస్టీలకు ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. టీ ప్రైడ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 233 యూనిట్లకు రూ.6 కోట్ల 90 లక్షలు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ. 2కోట్ల 66 లక్షలు మంజూరు అయ్యాయని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కులాంతర వివాహాలు చేసుకున్న 44 మంది జంటలకు 2,50,000 వేల చొప్పున రూ. 1,10,00,000 బడ్జెట్ మంజూరు అయిందని తెలిపారు. జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ లు 5 నిర్మాణాలు రూ 2 కోట్ల 25 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డిఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కల్హేర్: మండల పరిధిలోని గ్రామాల సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, రహదారుల మరమ్మతులు, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశించారు. కల్హేర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో బోర్లు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి మూలస్తంభాలని సంజీవరెడ్డి పేర్కొన్నారు. వారంతా సమన్వయంతో, సఖ్యతతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కల్హేర్ మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ధర్మవరం, సెప్టెంబర్ 1 (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని దిమ్మిల సెంటర్ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వేద సంకల్ప సేవా సంఘం, దాన ధర్మా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సోమసుందర్ శర్మ వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా వ్రతాలను నిర్వహించారు. మహిళలకు పూజా సామగ్రి, ప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి జల్లా కార్తీక్, సేవా సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ త్వరలో కొత్త పింఛన్లు - పరిటాల శ్రీరామ్

**ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికీ పింఛన్ల పంపిణీ**

ధర్మవరం, సెప్టెంబర్ 1 (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని 28వ వార్డు ఇందిరమ్మ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి, ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందుతున్నదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు రాని వారికి నెల రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దేవరకొండ బిఆర్ఎస్ నాయకులు వర్త్య రమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

అరుణ ప్రభ ,దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 1,దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు వర్త్య రమేష్ నాయక్ విదేశీ పర్యటన ముగించుకొని, తిరిగి దేవరకొండ నియోజకవర్గానికి చేరుకున్న సందర్భంలో, బి ఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఆయన నివాసం దేవరకొండలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను మెమెంటేతో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాఘవాచారి, ప్రకాష్, నరసింహ, మహేష్, సత్యం, నరేందర్, భీమానాయక్ బాబూజీ కోటేష్ ,రామకృష్ణ, వెంకటేష్, పీర్ మమ్మద్, బషీద్ తదితరులు పాల్గొన్నారు..

# పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుంది

**సంఘటితంగా ముందుకు సాగితేనే హక్కులు, అవకాశాలు సాధ్యం**

**ప్రభుత్వ విప్ డా. రామచంద్రు నాయక్**



అరుణప్రభ మహబూబాబాద్ సెప్టెంబర్ 1 : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో పద్మశాలి సమాజం సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగినప్పుడే హక్కులు, అవకాశాలను సాధించుకోవచ్చని పేర్కొన్నారు.మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మహబూబాబాద్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల వెంకన్న, మండల అధ్యక్షుడు బత్తుల రమేష్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల యాకయ్య ఆధ్వర్యంలో జిల్లా పద్మశాలి సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ డా. రామచంద్రు నాయక్‌కు పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న పద్మశాలి కుటుంబాల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని సమస్యలను సంఘటితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పద్మశాలి యువత విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.పద్మశాలి సంఘం మరింత బలోపేతం



కావడానికి నాయకులు, సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.

**భావోద్వేగానికి గురైన జిల్లా అధ్యక్షుడు**

సమావేశంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల వెంకన్న గతంలో వివిధ రాష్ట్రాల్లో సంఘం కోసం పనిచేసిన రోజులను గుర్తుచేసుకుంటూ మాట్లాడిన సమయంలో ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. సమాజం కోసం తాను చేసిన సేవలు, ఎదుర్కొన్న అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆయన భావోద్వేగానికి లోనవడం సమావేశంలో ప్రత్యేకంగా నిలిచింది.జిల్లా పద్మశాలి సంఘం జనరల్ బాడీ సమావేశంలో సంఘం నాయకులు, ప్రతినిధులు, పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం భవిష్యత్ కార్యాచరణ, సామాజిక అభివృద్ధి, సభ్యుల సమస్యలు, చేనేత రంగానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షులు దొంతు పురుషోత్తం జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పు శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరపాటి వెంకటేశ్వర్లు కొండబత్తిని జగదీశ్వర్ ప్రముఖ సైకియాట్రిస్ట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ పరికిపండ్ల అశోక్ కుమార్ కోప జిల్లా అధ్యక్షులు ప్రముఖ వైద్యులు కూరపాటి రమేష్ పట్టాభి లక్ష్మణ్ చలిమల్ల నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు కాముని.కుమారస్వామి డోర్నకల్ మండలం అధ్యక్షులు నాద శ్రీనివాస్ మరిపెడ మండల అధ్యక్షులు దిగజార్ల శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుండబత్తుల వెంకన్న కోప జిల్లా అధ్యక్షులు బుధరపు. శ్రీనివాస్ పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షులు కొండబత్తుల రవికుమార్ అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు బాల్య శ్రీనివాస్ కూరపాటి శ్రీనివాస్ కస్తూరి వెంకన్న కొండబత్తిని రమేష్ రమేష్

# ధర్మవరం యువతకు ఉద్యోగావకాశాలు

**సెప్టెంబర్ 8న మెగా జాబ్ మేళా**



ధర్మవరం, సెప్టెంబరు 1; (అరుణప్రభ న్యూస్) ధర్మవరం నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 8న ధర్మవరం పట్టణంలోని సి.ఎన్.బి. కళ్యాణ మండపంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, డీఎస్పీ బీవీ. జగన్నాథ్‌రాజు, మునిసిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్‌బాబు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 100కు పైగా జాతీయ, బహుళజాతి కంపెనీలు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బీ.ఫార్మసీ, డీ.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల యువత హాజరుకావచ్చన్నారు. ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభించే అవకాశముందని తెలిపారు. సెప్టెంబర్ 8న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ముందస్తుగా నైపుణ్య పోర్టల్ లేదా పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు: 8688466361, 9390176421, 9966682246. కార్యక్రమంలో పామిశెట్టి శివశంకర్, రమేష్, నారప్ప, ప్రకాష్‌గౌడ్, రవి, మంజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్ఐసి 70వ వార్షికోత్సవ వేడుకలు





భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ ఐ సి )70 వ వార్షికోత్సవ వేడుకలు సౌత్ జోనల్ కార్యాలయం లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రధాన కార్యాలయంలో జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ గారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి, ఈ వేడుకలకు ప్రముఖ వ్యాపారవేత్త వాసవి కన్స్ట్రక్షన్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ యర్రం విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన రీజనల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్ఐసి కి విలువైన పాలసీదారుడుగా ఎన్నో సంవత్సర సంవత్సరాలుగా అనుబంధం ఉన్న ఎర్రం విజయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే విధంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని విజయ్ కుమార్ తెలిపారు. ఎల్ఐసి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, మార్కెటింగ్ ఏజెంట్లు, డెవలప్మెంట్ ఆఫీసర్లను, ఎల్ఐసి ఏజెంట్లను ఆయన అభినందించారు. ఎల్ఐసి గ్యారెంటీకి,విశ్వాసానికి, పవిత్రతకు, ఆర్థిక భద్రతకు ప్రత్యేకంగా నిలిచిన సంస్థ ఎల్ఐసి అని ఆయన తెలిపారు. పిల్లల భవిష్యత్తుకు, విద్యాభ్యాసం, ఉన్నత విద్యా, వివాహం, కుటుంబార్థిక భద్రతకు, పదవి విరమణ అనంతరం ఎల్ఐసి ఎంతో అవసరమని చెప్పారు. ఎల్ఐసి 70 వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా సందర్భం సేవలు అందిస్తున్న తెలియజేశారు.అదేవిధంగా జీవిత బీమా సంస్థను విశ్వసించే తమ కష్టార్జిత సంపాదనను పొదుపుగా భద్రత పొందుతున్న కోట్లాదిమంది పాలసీదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కొటికె విఠల్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలు నిజమైన బలం అసలైన ముఖచిత్రం జీవిత బీమా అని కొటికె విటల్ తెలిపారు. ఏజెంట్లు సంతృప్తిగా ఉత్సాహంగా పనిచేసినప్పుడే సంస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.

# బీఎన్‌రెడ్డి డివిజన్ రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి హామీ

**22ఏ సమస్యపై కలెక్టర్‌కు బాధితుల వినతి**

**అసెంబ్లీ సమావేశాల అనంతరం చర్చించి పరిష్కరిస్తామని హామీ**





హైదరాబాద్, ఆగస్టు 31: బీఎన్ రెడ్డి డివిజన్‌లోని కాలనీల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి త్వరలో మార్గం సుగమం కానుందని వైదేహినగర్ కాలనీ అధ్యక్షుడు పి. దామోదర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్న నేపథ్యంలో.. 118 జీవో వచ్చినప్పటికీ అసంపూర్తిగా ఉన్న కాలనీల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీగౌడ్ సూచన మేరకు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశామని దామోదర్‌రెడ్డి తెలిపారు. తాము ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించిన కలెక్టర్.. వచ్చే అసెంబ్లీ సమావేశాల అనంతరం ఈ సమస్యపై చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న ముసారాంబాగ్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. అక్కడ మధుయాష్కీగౌడ్‌కు రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి జరిగిన ప్రయత్నాలను వివరించామని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వేదికపై ఉన్న సమయంలోనూ ఈ సమస్యపై మరోసారి మాట్లాడినట్లు తెలిపారు. బీఎన్ రెడ్డి డివిజన్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తున్న కాలనీ వాసుల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని దామోదర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

**క్రిటికల్ మినరల్స్ పరిశోధనకు 'త్రిముఖ' భాగస్వామ్యం**

**మోనాష్-ఐఐటీ హైదరాబాద్-సింగరేణి సంయుక్తంగా ముందడుగు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**





క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో సమావేశమయ్యారు. సమావేశంలో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ కేవలం వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండకూడదని, మొత్తం విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా, వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ భాగస్వామ్యానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన మరియు సాంకేతిక అభివృద్ధికి వేదికగా మలచాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం చేయడం ద్వారా ఖనిజాల అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే విధానాలపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, మోనాష్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ యాయిన్నిస్ వెంటికోస్, ఆస్ట్రేలియా--ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ మోహన్ ఎల్లిషెట్టి, ప్రొఫెసర్ రామన్ సింగ్, సింగరేణి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనపై బిఆర్ఎస్ నిరసన

**సెప్టెంబర్ 01- 08వ తేదీ వరకు జరిగే నిరసనలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలి**

**సెప్టెంబర్ 02 రోజున అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ**

**బోడుప్పల్ బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎంపీటీసీ మంద సంజీవరెడ్డి పిలుపు**



సెప్టెంబర్ 1, అరుణ ప్రభ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ లో మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా, సెప్టెంబర్ 01వ తేదీ నుంచి 08వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని,1000 పరిపాలనలో మహిళలను, రైతులను, యువకులను తెలంగాణ అన్ని వర్గాల ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ టిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల నిరసనలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు సెప్టెంబర్ 2 ఉదయం 9 గంటలకు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల ప్లకార్డులతో భారీ నిరసన ర్యాలీ ఉంటుందని ఈ ర్యాలీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యమకారులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, రామచంద్రారెడ్డి, బందారం శ్రీధర్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతిరావు ప్రత్యేక నజర్



అరుణప్రభ 1 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలో ప్రతిరోజు ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణకై డిఎస్పి తిరుపతిరావు ప్రత్యేక నజర్ చూపిస్తున్నారు ఇందులో భాగంగా బ్యాంకులు, షాపింగ్ కాంప్లెక్స్‌లలోని పార్కింగ్ స్థలాలలోనే కస్టమర్ల వాహనాలు పార్కింగ్‌కు వినియోగించ కోవాలని పార్కింగ్ స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసి కిరాయికి ఇస్తే ఊరుకునేది లేదని పోలీసుల హెచ్చరికలు జారీ చేసారు పార్కింగ్ స్థలాల్లో కాకుండా రోడ్లపై వాహనాలు నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు పార్కింగ్ స్థలాలను వినియోగించని పలు బ్యాంకులు, షాపింగ్ మాల్స్‌కు నోటీసులు జారీ చేసిన పోలీసులు.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాల పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసారు

## గ్రామీణ ప్రాంతాల్లో 93.4 శాతం పింఛన్ల పంపిణీ: ఎంపీడీవో వెంకటేశు



ధర్మవరం, సెప్టెంబర్ 1 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పింఛన్ల పంపిణీ సజావుగా కొనసాగిందని ఎంపీడీవో వెంకటేశు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 6,660 మంది పింఛన్‌దారులకు గాను సెప్టెంబర్ 1న 6,219 మందికి, అంటే 93.4 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి సెప్టెంబర్ 2న పింఛన్లు అందజేస్తామని ఎంపీడీవో వెల్లడించారు.

## జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు కొత్త లోగోలు

హైదరాబాద్ మహానగర పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లకు రూపొందించిన కొత్త లోగోలను రాష్ట్ర ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఖరారు చేశారు. పరిశుభ్రత, పచ్చదనం, సుస్థిర అభివృద్ధి, మెరుగైన పౌర సేవలు, నగర సుపరిపాలన.. అనే ప్రధాన భావాలను ప్రతిబింబించేలా మూడు కార్పొరేషన్ల లోగోలకు ప్రత్యేక రూపకల్పన చేశారు. జీహెచ్‌ఎంసీ లోగో పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన, సుస్థిరమైన గ్రేటర్ హైదరాబాద్ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. లోగోలోని ఆకుపచ్చ ఆకులు అభివృద్ధి, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు సంకేతం కాగా, నీలిరంగు నీటి బొట్టు స్వచ్ఛమైన నీరు, నీటి సంరక్షణ, అత్యవసర పౌర సేవలను సూచిస్తున్నాయి. హృదయాకార రూపం ప్రజల పట్ల శ్రద్ధ, సంక్షేమం, ప్రజానుకూల పాలనను ప్రతిబింబిస్తుంది. నీలం, ఆకుపచ్చ రంగులు విశ్వాసం, బాధ్యత, సుపరిపాలన, ప్రకృతి, ప్రగతి, పర్యావరణహిత అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తాయి. "పచ్చని, పరిశుభ్రమైన, మెరుగైన హైదరాబాద్" అనే దృక్పథాన్ని ఈ లోగో చాటుతుంది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోగో ఆధునిక, పచ్చని, ఆరోగ్యకరమైన, ప్రగతిశీల నగరాన్ని ప్రతిబింబిస్తుంది. ఆకుపచ్చ ఆకులు పర్యావరణ పరిరక్షణను, మధ్యలోని నీటి బొట్టు స్వచ్ఛత, నీటి సంరక్షణ, కీలక మున్సిపల్ సేవలను సూచిస్తాయి. నీలం--ఆకుపచ్చ రంగుల సమ్మేళనం విశ్వాసం, పారదర్శకత, అభివృద్ధి, పర్యావరణహిత పాలనను తెలియజేస్తుంది. స్మార్ట్ మౌలిక వసతులు, మెరుగైన పౌర సేవలు, సుస్థిర అభివృద్ధితో మరింత పరిశుభ్రమైన, పచ్చని సైబరాబాద్ నిర్మాణ లక్ష్యాన్ని ఈ లోగో ప్రతిబింబిస్తుంది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ లోగో ప్రకృతి, ప్రజలు, అభివృద్ధి అనే మూడు ప్రధాన భావాలకు ప్రతీకగా రూపొందించారు. హృదయాకారంలోని ఆకుపచ్చ రూపం ప్రజల పట్ల శ్రద్ధతో పాటు పరిశుభ్రమైన, సుస్థిరమైన పర్యావరణాన్ని సూచిస్తుంది. తాజా ఆకులు పచ్చదనం, అభివృద్ధి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు సంకేతాలు. నీలం రంగు విశ్వాసం, బాధ్యత, పారదర్శక పాలనను ప్రతిబింబిస్తుంది. "అభివృద్ధి, ప్రగతిశీల పాలన" అనే భావనను ఈ లోగో తెలియజేస్తుంది.



## ధర్మవరంలో 95 శాతం పెన్షన్ల పంపిణీ

**మిగిలిన వారికి నేడు అందజేత**

ధర్మవరం, సెప్టెంబరు 1; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని 40 వార్డుల్లో పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగిందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. పట్టణంలో మొత్తం 17,637 మంది పింఛనుదారులు ఉండగా, సెప్టెంబరు 1న 16,673 మందికి సచివాలయ ఉద్యోగులు వారి ఇళ్ల వద్దే పెన్షన్లు అందజేశారని పేర్కొన్నారు. పెన్షన్ తీసుకోని మిగిలిన లబ్ధిదారులకు సెప్టెంబరు 2న పంపిణీ చేసి 100 శాతం పంపిణీ పూర్తి చేస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు మేనేజర్ అశ్వత్ నారాయణ, టీపీఆర్వో విజయభాస్కర్ పాల్గొన్నారు.



## వివేకానంద కళాశాల విద్యార్థుల విజయభేరి

ధర్మవరం, సెప్టెంబరు 1; (అరుణ ప్రభ న్యూస్) శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మొదటి సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బీసీఏలో బి. తస్లీం 95 శాతం, బీకాంలో జీవన 94 శాతం మార్కులతో యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారు. బీసీఏలో పలువురు విద్యార్థులు 90 శాతానికి పైగా, బీకాంలో సోనియా, జ్ఞానేశ్వరి, నవ్యశ్రీ 93 శాతం మార్కులు సాధించారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో జి. రిషిత 92 శాతం, హరిత 91 శాతం మార్కులు సాధించారు. మొత్తం 82 మంది 80 శాతానికి పైగా, 133 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను అభినందించారు.

# రైతు నేస్తం కార్యక్రమంలో ఎరువుల సరఫరా యాప్‌పై రైతులకు అవగాహన

**ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా పారదర్శక ఎరువుల పంపిణీ: వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి**





హైదరాబాద్, సెప్టెంబర్ 1: రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం 105వ ఎపిసోడ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి, ఐఏఎస్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని వ్యవసాయ సంచాలకులు తెలిపారు. ఈ యాప్ విధానంపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఈ యాప్ ద్వారా ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని, మిగిలిన 10 జిల్లాల్లో కూడా రేపటి నుండి యాప్ ద్వారా సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు.రాష్ట్ర యూరియా యాప్ ద్వారా ఇప్పటివరకు 33.97 లక్షల మంది రైతులు 141.93 లక్షల యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, వారిలో 128.93 లక్షల బస్తాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా, ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 15.01 లక్షల క్యూఆర్ కోడ్‌లు జనరేట్ కాగా, 59.78 లక్షల బస్తాలు బుక్ కాబడ్డాయని, వాటిలో 41.68 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేసినట్టు వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏడు రకాల వరి సన్నరకాలు సాగుచేసిన రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, వారికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఆ వంగడాలు సాగుచేసిన రైతులు తమ విత్తన కొనుగోలు వివరాలను సంబంధిత డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద కొనుగోలు చేయకుండా సొంత విత్తనాలు వినియోగించిన రైతులు స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి, వ్యవసాయ విస్తరణాధికారి వద్ద తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ రెండు అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై కమిషనరేట్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయానికి చెందిన ఏడీఏ (ఫర్టిలైజర్స్) కుమారి మాధవి వివరణాత్మక ప్రసంగం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరాను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్‌ను వినియోగంలోకి తెచ్చినట్లు ఆమె తెలిపారు. ఎరువుల బుకింగ్, పంపిణీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం వల్ల కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. ఈ యాప్ పనితీరుపై ప్రత్యేక వీడియో ప్రదర్శన కూడా రైతులకు అందించారు. ఇదే కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితి, భూగర్భ జలమట్టాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భూగర్భ జల శాఖ సంయుక్త సంచాలకులు, సాగునీటి శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు రైతులకు కీలక సూచనలు అందించారు. అకాల వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో ప్రత్యామ్నాయ పంటలు, ప్రస్తుత పంటల నిర్వహణపై పీజేటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లతీఫ్ పాషా అవగాహన కల్పించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా సాంప్రదాయ యూరియాతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన నానో యూరియా వినియోగంపై ఇఫ్కో క్షేత్రస్థాయి అధికారి బాలవికాస్ వివరించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన రైతు నాగరాజు తన సోయాబీన్ పంటలో నానో యూరియా వినియోగం ద్వారా పొందిన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. చివరగా శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మమేకమై తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌కు చేరిన నైనీ మైన్ తొలి బొగ్గు రేక్





దామరచర్ల, సెప్టెంబర్ 1, 2026: యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) విద్యుత్ ఉత్పత్తిలో ఒక కీలకమైన మైలురాయిని అధిగమించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలో నడుస్తున్న ఒడిశాలోని 'నైనీ' బొగ్గు గని నుంచి సేకరించిన అత్యంత నాణ్యమైన బొగ్గుతో కూడిన తొలి రైల్వే రేక్ (రైలు) 4,000 టన్నుల బరువుతో మంగళవారం ప్లాంట్‌కు చేరుకుంది. ఈ తొలి బొగ్గు రేక్‌ను టీజీజెన్‌కో డైరెక్టర్ (బొగ్గు, లాజిస్టిక్స్) శ్రీ బి. నాగ్య, డైరెక్టర్ (థర్మల్, ప్రాజెక్ట్స్) శ్రీ వై. రాజశేఖర్ రెడ్డిలు ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, సురేష్, సూర్యనారాయణతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యుత్ రక్షణకు భరోసా: నైనీ బ్లాక్ నుంచి వచ్చిన అధిక నాణ్యత (అధిక ఉష్ణ సామర్థ్యం) కలిగిన ఈ బొగ్గు రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడానికి, గరిష్ఠ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఎంతో దోహదపడుతుంది. ఒడిశా నుంచి సుమారు 1,050 కిలోమీటర్ల సుదీర్ఘ దూరం రవాణా చేయాల్సి వచ్చినప్పటికీ, బొగ్గు ఉత్తమ నాణ్యత, అధిక ఉష్ణ సామర్థ్యం కారణంగా బాయిలర్ల పనితీరు మెరుగవుతుంది. ఇది బూడిద సమస్యలను తగ్గించి, రవాణా వ్యయాన్ని పూర్తిగా సమర్థిస్తుంది.

**సమన్వయంతో విజయం:** గౌరవ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవతో టీజీజెన్‌కో, సింగరేణి (ఎస్‌సీసీఎల్), భారతీయ రైల్వేల మధ్య అద్భుతమైన సమన్వయం సాధించి సుదూర రవాణా ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. రాబోయే రోజుల్లో నైనీ మైన్ నుంచి నిరంతరాయంగా బొగ్గు రేకులు రావడం వల్ల వైటీపీఎస్‌లో తగినంత బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంటాయి. దీంతో రాష్ట్రానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి భరోసా కలుగుతుంది.

# ఛేజ్ చేసి పట్టుకుంటే.. తప్పుడు కేసు రాస్తారా?

## పోలీసుల తీరుపై జనసేన నేత అసంతృప్తి

## బియ్యం అక్రమ రవాణా వెనుక పెద్దల హస్తం..

## సూత్రధారులను తప్పించి డ్రైవర్‌పై కేసా

## ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా

## జనసేన నేత చల్లా శ్రీ వరుణ్ వెల్లడి



ఎమ్మిగనూరు, (అరుణ ప్రభ న్యూస్):- పేదల ఆకలి తీర్చే ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలిస్తున్న ముఠాలకు, వారికి వత్తాసు పలుకుతున్న కొందరు అధికారుల తీరుకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని జనసేన పార్టీ నేత చల్లా శ్రీ వరుణ్ స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాము ప్రత్యక్షంగా పట్టుకుని అప్పగించిన పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఉదంతంలో పోలీసులు నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్), పౌరసరఫరాల శాఖ అధికారుల పంచనామా పూర్తిగా వాస్తవ దూరంగా ఉన్నాయని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పేదలకు అందాల్సిన నిత్యావసర బియ్యాన్ని డీలర్లు పక్కదారి పట్టిస్తూ, నిల్వలు లేవనే నెపంతో అక్రమార్కులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. స్థానిక రహస్య స్థావరాల నుంచి స్మగ్లర్లు ఈ బియ్యాన్ని మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ వంటి పొరుగు రాష్ట్రాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న ముఠా కదలికలపై తమ బృందం పక్షం రోజుల పాటు రహస్య నిఘా పెట్టిందన్నారు. ఎమ్మిగనూరు నుంచి కర్నూలు మార్గంలో వెళ్తున్న బొలెరో వాహనాన్ని దాదాపు పది కిలోమీటర్లు వెంబడించి ఎర్రకోట వద్ద రెడ్ హ్యాండెడ్‌గా అడ్డుకున్నామని, అనంతరం స్థానిక విలేకరుల సమక్షంలోనే పోలీసు అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. అయితే తాము పట్టుకున్న నిజాన్ని పక్కనబెట్టి, కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వస్తుండగా తామే స్వయంగా పట్టుకున్నట్లు పోలీసులు తప్పుడు వివరాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. వాహన డ్రైవర్ ఫోన్‌కు వచ్చిన కాల్స్ ఆధారంగా ఓ స్థానిక రాజకీయ నేత హస్తం ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, అయినప్పటికీ ప్రధాన సూత్రధారులను కాపాడేందుకు రోజువారీ కూలీ అయిన డ్రైవర్‌పై మాత్రమే కేసు బనాయించడం దారుణమన్నారు. ఈ దందా వెనుక పెద్ద నాయకుల హస్తం ఉందని డ్రైవర్ మీడియా ముందే స్వయంగా అంగీకరించాడని గుర్తుచేశారు. గతంలో వైకాపాలో ఉండి ప్రస్తుతం టీడీపీలో చేరిన ఒక చోటా లీడర్‌కు చెందిన బియ్యంగా స్వయంగా ఫోన్ రికార్డింగులు ఉన్నాయని, స్టేషన్ వద్దకు సదరు వ్యక్తి కుమారులు వచ్చి పోలీసులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలు, కాల్ రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అవినీతి రహిత పాలనకు కట్టుబడి పనిచేస్తుంటే, క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాయడం క్షమార్హం కాదన్నారు. తప్పుడు నివేదికలు తయారు చేసిన పోలీసు, సివిల్ సప్లైస్ అధికారుల తీరుపై జిల్లా ఎస్పీతో పాటు నేరుగా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తానని తేల్చిచెప్పారు. అక్రమ బియ్యం రవాణా, దొంగ నిల్వలను సమూలంగా అరికట్టే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# సమాచార, పౌర సంబదాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్.



హైదరాబాద్, సెప్టెంబర్ 1: సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా (Additional Director) పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్‌కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డి గారిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# టెట్ నిబంధనల సడలింపునకు చలో విజయవాడ

ధర్మవరం, సెప్టెంబరు 1; (అరుణ ప్రభ న్యూస్) ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధనలు సడలించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 3న విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అర్హత మార్కులు తగ్గించాలని, పరీక్షను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, బోధిస్తున్న సబ్జెక్టులపైనే పరీక్ష పెట్టాలని వారు డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(1)ను సవరించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి పి. అమర్‌నారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మేరీవర కుమారి తదితరులు పాల్గొన్నారు.



# మహారెడ్డి నారాయణ్ రెడ్డి 11వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్ గ్రామ సీనియర్ నాయకులు మహారెడ్డి నారాయణ్ రెడ్డి గారి 11వ వర్ధంతి సందర్భంగా వారి నివాసానికి వెళ్లి వారి ఫోటో కు పూలమాల వేసి నివాళులర్పించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్,మహారెడ్డి మహిపాల్ రెడ్డి,నరసింహా రెడ్డి జణజ మాజీ చైర్మన్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, సంతోష్ రెడ్డి,సాయిలు సర్పంచ్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలి

## భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1 (అరుణప్రభ): జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని, నిర్ణయించిన గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో భూముల రీసర్వే ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే జరుగుతున్న గ్రామాలు, ఇప్పటివరకు పూర్తయిన గ్రామాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంభీరావుపేట మండలం శ్రీనివాసపురం, వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి, కొనరావుపేట మండలం లచ్చపేట, చందుర్తి మండలం అనంతపల్లి (పీకే) గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా బోయినిపల్లి మండలం కొత్తపేట, రుద్రంగి మండలం రుద్రంగి, ఇల్లంతకుంట మండలం సిరికొండ, తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్, ముస్తాబాద్ మండలం తుర్కపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి, గంభీరావుపేట మండలం ఖుర్దు లింగంపల్లి, కొనరావుపేట మండలం మర్తనపేట, సిరిసిల్ల మండలం పెద్దూర్ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. గ్రామాల సరిహద్దుల సర్వేను సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖలు సమన్వయంతో సంయుక్తంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భూములకు సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించి, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సంబంధిత జిల్లా అధికారులు, డీఐలు పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచడంతో పాటు, వారికి అవసరమైన మేరకు రోవర్ యంత్రాలను సమకూర్చుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూములకు సంబంధించిన వివరాలను పకడ్బందీగా, తప్పులు లేకుండా సేకరించి రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

## ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడి అరెస్ట్

హైదరాబాద్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో బీహార్‌కు చెందిన నందులాల్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) రోటరీ నుంచి ఖాజాగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న నందులాల్‌ను సందీప్ తన కారుతో అతివేగంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన జైద్ షా ఖాద్రీ అనే విద్యార్థి, క్షతగాత్రుడైన నందులాల్‌ను తన కారులో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో మహీంద్రా కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ రెండో ప్రమాదంలో మరింత తీవ్రంగా గాయపడిన నందులాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మహీంద్రా కారు ఆపకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక నిపుణుల సహాయంతో ప్రమాదానికి కారణమైన రెండు వాహనాలను గుర్తించారు. అనంతరం రెండు కార్లను స్వాధీనం చేసుకుని, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయిని విచారించిన తర్వాత ఆయన కుమారుడు సందీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# బీజేపీ కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే

### దాడులకు పాల్పడితే చూస్తూ
### ఊరుకోం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి





ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1 (అరుణప్రభ): నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి అత్యంత అప్రజాస్వామిక చర్య అని తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేకనే పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని విమర్శించారు. పార్టీ కార్యాలయంపై దాడి చేయడం కేవలం బీజేపీపై దాడి చేయడం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమేనని అన్నారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం ఆందోళనకరమని, దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులను విధానాలతో, ప్రజల తీర్పుతో ఎదుర్కోవాలే తప్ప దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదన్నారు. నల్గొండ జిల్లాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై జరిగిన దాడిని కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అధికార పార్టీకి చెందిన వారు దాడులకు పాల్పడినా పోలీసులు చట్టాన్ని సమానంగా అమలు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నారని, దానిని చేతకానితనంగా భావించవద్దని గోపి హెచ్చరించారు. ఇకపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడితే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టబద్ధంగా ప్రజల మధ్యనే పోరాటం కొనసాగిస్తామని, దాడులకు పాల్పడేవారికి చట్టపరంగా తగిన సమాధానం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శులు కర్నె హరీష్, మీసా సంజీవ్, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేష్, కథలాపూర్ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రం, కొనరావుపేట మండల అధ్యక్షుడు మీరాల్కర్ బాలాజీ, చందుర్తి మండల అధ్యక్షుడు మోకిలే విజయేందర్, రుద్రంగి మండల అధ్యక్షుడు కర్ణ బత్తుల వేణుగోపాల్, వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్‌తో పాటు బీజేపీ జిల్లా, మండల పదాధికారులు, సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హనుమాన్‌నగర్‌కాలనీలో
## అంగరంగ వైభవంగా బోనాల పండుగ వేడుకలు

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం హనుమాన్ నగర్ కాలనీలో వైబోపేతంగా దుర్గమ్మ. పోచమ్మ బోనాల ఉత్సవాల ఊరేగింపు...

**పోతురాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాలు...**

శ్రీ దుర్గమ్మ.పోచమ్మ తల్లి అమ్మ వార్ల కృపతో ప్రజలందరినీ చల్లంగా చూడాలని భక్తులు . కోరుకున్నారు మంగళవారం నాడు పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలో మహిళా భక్తులు సామూహిక బోనాల ఉత్సవాలను నిర్వహించారు ఈ వ్యాసాలు ఉత్సవాలలో డప్పు వాయిద్యాలు . పోతురాజు విన్యాసాలు. శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఉత్సవాలను వైభోపేతంగా నిర్వహించారు. తదుపరి అమ్మవార్లకు బోనం సమర్పించి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద్ వితరణ చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ శ్రీనివాస్.గౌడ్ 8వ వార్డు కొత్త గొల్ల సోమశేఖర్ మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ దుర్గమ్మ పోచమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న కాలనీ ప్రజలకు. వివిధ పార్టీ నాయకులకు ఆ అమ్మవారి కృప తో చల్లగా చూడాలని. ఈ ధార్మిక కార్యక్రమాలను చేసినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్. కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్. కొత్త గొల్ల చంద్రశేఖర్. మల్లేశం. సర్పంచ్ ఆశి రెడ్డి.రమేష్ గౌడ్. రామచంద్ర. కె ప్రవీణ్ కుమార్. వీరన్న పటేల్. కూచిని సతీష్ .రత్నాకర్ రెడ్డి. శ్రీనివాస్. సిహెచ్ సత్యనారాయణ. రవి. శ్రీనివాస్. వీరేశం టీచర్ శివకోటి స్వామి తదితరలు మహిళా భక్తులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి

### డీసీసీ కార్యాలయం వద్ద జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన





ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1 (అరుణప్రభ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కలిసి రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయించాయని ఆరోపించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య విలువలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉత్తరాఖండ్‌లోని రామలీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ అనంతరం మైదానాన్ని గంగాజలంతో శుద్ధి చేయడాన్ని సంగీతం శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ చర్య మల్లికార్జున ఖర్గేను అవమానించడమేనని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఖర్గేను అవమానించే చర్యలకు పాల్పడి, మరోవైపు వాటిని ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసులు నమోదు చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని సంగీతం శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళల భద్రతే లక్ష్యం..
## ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### వినాయక చవితి వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి : పోలీసుల అవగాహన

ధర్మవరం, సెప్టెంబరు 1; (అరుణ ప్రభ న్యూస్): మహిళల భద్రత, రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని టూటౌన్ ఎస్ఐ జయానాయక్, ఎస్ఐ వీరేష్ సూచించారు. ధర్మవరం నియోజకవర్గంలోని కొత్తపేట ఉమామహేశ్వర ఆలయంలో మహిళలు, స్థానిక ప్రజలకు మహిళల భద్రతతో పాటు వినాయక చవితి వేడుకల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల పట్ల ఎలా గౌరవంగా ప్రవర్తించాలి, ఆకతాయిల వేధింపులను ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి సందర్భాల్లో పోలీసులను ఆశ్రయించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, వేధింపులకు పాల్పడే ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో టూ టౌన్ ఏ. ఎస్. ఐ దోనా సింగ్, పోలీసు సిబ్బంది, ఉమామహేశ్వర ఆలయ అధ్యక్షులు ఉట్టిప్రసాద్, లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఉట్టిప్రసాద్, బాబా ఫక్రుద్దీన్, వాసు, మున్నీ, పామిశెట్టి కళ్యాణి తదితరులతో పాటు వార్డు మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి

### ఐదుగురు అరెస్ట్.. రూ.9,400 నగదు,
### ఐదు మొబైల్ ఫోన్లు, ఆటో, పేకముక్కలు స్వాధీనం
### అసాంఘిక కార్యకలాపాలకు
### పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1 (అరుణప్రభ): సిరిసిల్ల పట్టణ పరిధిలోని బైపాస్ ప్రాంతంలో రామప్ప దేవాలయానికి వెళ్లే దారిలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం సాయంత్రం మెరుపు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకట్రాజం ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మికంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,400 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఒక ఆటో, 52 పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని తదుపరి చర్యల నిమిత్తం సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్ తెలిపారు. మరో ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారి వివరాలు: వెంకటాపురం గ్రామానికి చెందిన జాగిరి మధు, చీర్లవంచ ఆర్అండ్ఆర్ గ్రామానికి చెందిన చల్ల రాజు, సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పర్వేడా గ్రామానికి చెందిన కమ్మం కుమార్, వెంకటాపురం గ్రామానికి చెందిన రాగుల చందు, వేములవాడ ఆగ్రహారం గ్రామానికి చెందిన చెలిమెల్ల రమేష్ ఉన్నారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి స్థావరాలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించి సహకరించాలని కోరారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిరుపతి, రాజేష్, ఉమాపతి, శంకర్, శివరాజ్ పాల్గొన్నారు.



## వేములవాడలో రోడ్డు ప్రమాదం..
## నలుగురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1: అరుణప్రభ న్యూస్ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కొండగట్టు దర్శనం అనంతరం వేములవాడ మీదుగా కామారెడ్డి వెళ్తున్న భక్తుల కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. వేములవాడ జగిత్యాల బస్టాండ్ సమీపంలో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# పదవీవిరమణ ఒక బాధ్యతకే ముగింపు.. సేవలకు కాదు

### పంచాయతీరాజ్ డీఈ ఇంద్రసేనారెడ్డి
### సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




పెద్దఅంబర్‌పేట్ సెప్టెంబర్ (అరుణ ప్రభ) పంచాయతీరాజ్ శాఖ డీఈగా ప్రభుత్వ సేవల్లో అంకితభావంతో పనిచేసి ప్రజలకు విశేష సేవలందించిన ఇంద్రసేనారెడ్డి సేవలు అభినందనీయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట్‌లో నిర్వహించిన ఇంద్రసేనారెడ్డి పదవీవిరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం కేవలం ఒక పదవి మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇంద్రసేనారెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. పదవీవిరమణ అనేది ఒక బాధ్యతకు మాత్రమే ముగింపు.. సమాజానికి చేసిన సేవలకు ముగింపు కాదని ఎమ్మెల్యే అన్నారు. ఉద్యోగ కాలంలో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. పదవీవిరమణ అనంతరం ఇంద్రసేనారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, భాస్కరాచారి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఇంద్రసేనారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

# ప్రపంచ లెటర్ రైటింగ్ డే సందర్భంగా పాణిని హైస్కూల్‌లో లెటర్ రైటింగ్ పోటీ

అరుణప్రభ 1 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ మారుతున్న సాంకేతిక ప్రపంచంలో ఒకప్పుడు మనుషుల మధ్య భావోద్వేగాలను, ఆప్యాయతలను, జ్ఞాపకాలను పంచిన లెటర్ రైటింగ్ సంప్రదాయం క్రమంగా కనుమరుగవుతోంది. నేటి తరం ఇంటర్నెట్, వాట్సాప్, సోషల్ మీడియా వంటి డిజిటల్ వేదికల ద్వారా క్షణాల్లో సందేశాలను పంపించుకుంటున్నప్పటికీ, చేతిరాత లేఖలో ఉండే ఆత్మీయత, అనుభూతి, భావవ్యక్తీకరణకు ప్రత్యేకమైన స్థానం ఉంది ప్రపంచ లెటర్ రైటింగ్ డే సందర్భంగా పాణిని హైస్కూల్‌లో విద్యార్థులకు లెటర్ రైటింగ్ పోటీని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు లేఖ రాయడం యొక్క ప్రాధాన్యతను తెలియజేయడంతో పాటు, తమ ఆలోచనలు, భావాలు, అనుభవాలను చక్కని భాషలో అక్షర రూపంలో వ్యక్తపరచే అవకాశాన్ని కల్పించారు లేఖ రాయడం అనేది కేవలం సమాచారాన్ని చేరవేయడం మాత్రమే కాకుండా, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, భాషా నైపుణ్యం, భావవ్యక్తీకరణ మరియు ఊహాశక్తిని పెంపొందించే ఒక మంచి సాధనం అని ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ కమ్యూనికేషన్‌కు అలవాటు పడుతున్న నేటి తరానికి, లెటర్ రైటింగ్ ద్వారా గత తరాల కమ్యూనికేషన్ విధానాన్ని పరిచయం చేయడం, దాని విలువను గుర్తుచేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "లెటర్ రైటింగ్ అనేది మన భావాలను కేవలం పదాలుగా కాకుండా, మనసుతో అక్షరాల రూపంలో వ్యక్తపరచే ఒక అందమైన కళ. నేటి డిజిటల్ యుగంలో ఈ సంప్రదాయాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారి సృజనాత్మకతతో పాటు భాషా నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేయవచ్చు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పాతకాలపు మధుర జ్ఞాపకాలను పరిచయం చేయడంతో పాటు, భావాలను స్పష్టంగా వ్యక్తపరచే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి" అని తెలిపారు. ఈ లెటర్ రైటింగ్ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ ఆలోచనలను చక్కని చేతిరాతతో లేఖల రూపంలో వ్యక్తపరిచారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, మనసును తాకే చేతిరాత లేఖకు ఉన్న ప్రత్యేకత ఎప్పటికీ నిలిచిపోతుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.






# ఆరోగ్యమే మహాభాగ్యం

**(జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా ( సెప్టెంబర్1 - 7వ తేదీ వరకు) రాసిన కవిత )**

నీ ఆహారమే నీకు ఔషధం కావాలి
నీ ఔషధమే నీ ఆహారం కావాలి
హిపోక్రేట్స్
ప్రాచీన గ్రీక్ వైద్య శాస్త్రవేత్త

మనం రోగాల బారిన పడ్డాక
బిమందులు మింగేకంటే
తీసుకునే ఆహారంలో సమతుల
ఆహారంఉంటే రోగాలను
బినివారించవచ్చుఅన్న
హిపోక్రెట్స్ వాక్యనుబి
బిస్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రకృతి ప్రసాదించిన
పచ్చని కూరగాయలు
ఆరోగ్యానికి
అసలైన సిరులు

రంగురంగుల తాజా
పండ్లు మనకు అందిస్తాయి
రోగనిరోధక శక్తులను

ఆహారమే ఇంధనం వ్యాధులతో
పోరాడే రోగనిరోధక శక్తి విటమిన్స్
ఖనిజాలు ఉన్న సహజ ఆహారం
ద్వారనే లభిస్తాయి ఆహార
నియమాలు పాటిస్తే 80 శాతం
జీవన శైలి వ్యాధులను
నివారించ వచ్చు

తృణధాన్యాలు పప్పుల
మేళవింపు బలమైన శరీరానికి
ఆయువు పట్టు ఇమ్యూనిటీతో
రోగాలపై గెలుపుకు సారధి

కాయగూరలు కమ్మని
పోషకాల సిరి
వీటిని తింటే అనారోగ్యాలు
దూరమౌతాయి

జంక్ ఫుడ్ కాసేపు పక్కన
పెడదాం సమతుల్య
ఆహారానికి జై కొడుదాం

చిరుధాన్యాల ప్రాముఖ్యతను
తెలుసుకుందాం చిరుధాన్యాల
వంటకాల ఆవశ్యకతపై
సమాజాన్ని చైతన్య పరుద్దాం

పోషకాల విలువను
ఇంటింటికీ చాటుదాం
ఆరోగ్యకరమైన
భారతాన్ని నిర్మిద్దాం,
పోషకాహార
వారోత్సవాలను
విజయవంతం చేద్దాం

ఆరోగ్యకరమైన ఆహారమే
ఆనందకరమైన జీవితానికి
తొలి అడుగు

మంచి హారం కోసం పెట్టే ఖర్చు
రేపటి హాస్పటల్ ఖర్చులను
దూరం చేసే పెట్టుబడి రుచి
కోసం కాక శక్తి కోసం తిందాం
పోషకాహారంతో
నవభారతం నిర్మిద్దాం

**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
రచయిత కాలమిస్ట్
కరీంనగర్
9440245771



## నేదునూరి పిలుపు
## పరిహాసం దాటి ప్రగతి వైపు

ఓ మనిషి నీ విజయాలను
ఓర్వలేని వారు కొందరు
నీప్రతి కదలికను ప్రతి
అడుగును తప్పు పట్టే
కుటిలురు కొందరు

నీ గుండెల్లో గాయాన్ని చూడక
పరిహాసించే నిర్ధయులు కొందరు
నీ ప్రతిభను గుర్తించక
అపహాస్యం చేసే అజ్ఞానులు
ఎగతాళి చేసేవారితో
సంబంధాలు తెంచుకో
నీ ఆత్మగౌరవాన్ని
కాపాడుకుంటూ ముందుకు సాగిపో

నీ కన్నీటిని తుడిచే కరుణ
ఉన్న హృదయాలను వెతుక్కో
నీ మౌనంలో ఉన్న బాధను గ్రహించే మనుషులను ఆశ్రయించు

నీ కష్టాల కడలిలో తోడుగా నిలిచే వాళ్ళే నిజమైన బంధువులు
నీ గెలుపును చూసి నీకంటే మిన్నగా మురిసిపోయే వారే
నీ హితులు ఆదరించే వారితో
ఆత్మీయత పెంచుకో

లోకుల విమర్శలు నీ ప్రయాణాన్ని
అడ్డుకునే శక్తి కాకూడదు
అవి నీవు ఉన్నత శిఖరాలు
అధిరోహించడానికి తోడ్పడే
సోపానాలు కావాలి

నిన్ను తక్కువ చేసే మనుషుల
నీడను సైతం వదిలేయ్
నిన్ను గౌరవించే సజ్జనుల
సాంగత్యంలో సామ్రాజ్యాన్ని నిర్మించుకో

ఎవరికోసమో నీకు నువ్వు
తగ్గించుకోకు
నీవ్యక్తిత్వాన్ని వదులుకోకు
ధైర్య సాహసాలతో అడుగు
ముందుకెయ్యి
సంకల్పం పట్టుదల ఆత్మవిశ్వాసం
నిన్నువిజయ తీరాలకు చేరుస్తుంది

**నేదునూరి కనకయ్య**
**రచయిత కాలమిస్ట్**
**కరీంనగర్**
**9440245771**



# రాహుల్‌గాంధీపై అక్రమ ఎఫ్ఐఆర్‌కు నిరసన

సిద్దిపేట, సెప్టెంబర్ 1: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో దురుద్దేశపూర్వకంగా నమోదు చేసిన అక్రమ ఎఫ్ఐఆర్‌ను నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేటలోని డీసీసీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ నిరసనలో రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే దళిత వ్యతిరేక భావజాలంతో కులతత్వ శుద్ధీకరణ ఆచారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## కొత్తచెరువులో నూతన బోర్‌వెల్‌కు శంకుస్థాపన

అల్వాల్: కొత్తచెరువు బేబీ పాండు వద్ద మంచినీటి సౌకర్యం కల్పించేందుకు నూతన బోర్‌వెల్ పనులను మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ప్రారంభించారు. రాబోయే వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని బేబీ పాండులో ప్రస్తుతం ఉన్న మురుగునీటిని తొలగించి, శుభ్రపరిచి కొత్త నీటిని నింపేందుకు బోర్‌వెల్ ఎంతో అవసరమని శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బోర్‌వెల్ పనులతో పాటు పరిసర ప్రాంతాలను కూడా ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు లింగారెడ్డి, మహేందర్ గౌడ్, సాజిద్, భాస్కర్, మనీష్, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూదేవి నగర్‌లో ఎస్ఐఆర్ నోటీసుదారుల కోసం ప్రత్యేక కౌంటర్

అల్వాల్: భూదేవి నగర్ పార్కు వద్ద ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారి సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు గల్లంతు కాకుండా ఉండేందుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని బూత్ లెవల్ అధికారులు బీఎల్ఓలు నోటీసులు అందుకున్న వారికి సూచించారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఎల్ఓలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ పనులను పూర్తి చేయిస్తున్నారని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ఆందోళన చెందకుండా అవసరమైన పత్రాలను సమర్పించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లెల శివ, నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, భాస్కర్, దశరథ యాదవ్, మల్లేష్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, సుధాకర్, వెంకట్రావు, జ్యోతి తదితరులతో పాటు బీఎల్ఓలు రుక్మిణి, జ్యోతి, అనిత, సరిత, మ్యాగీ, వాణి తదితరులు పాల్గొన్నారు.



# విశాఖపట్నంలో మార్మోగిన జనసేన నినాదాలు

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో ఘనంగా పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

**లీలామహల్ థియేటర్‌లో అభిమానులతో కలిసి 'పంజా' సినిమా వీక్షణ.. బాణాసంచా వెలుగుల మధ్య కేక్ కటింగ్**



విశాఖపట్నం, అరుణ ప్రభ న్యూస్ (సెప్టెంబర్ 1): జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం నగరంలో జనసేన శ్రేణులు, పవన్ కళ్యాణ్ అభిమానులు అత్యంత ఘనంగా సంబరాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అభిమానులు పెద్ద ఎత్తున వివిధ కార్యక్రమాలు చేపట్టగా, లీలామహల్ థియేటర్ పరిసరాలు జనసేన నినాదాలు మరియు అభిమానుల కేరింతలతో తీవ్ర సందడిగా మారాయి.

**అభిమానులతో కలిసి 'పంజా' సినిమా వీక్షణ**

ఈ విశేష వేడుకల సందర్భంగా జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ లీలామహల్ థియేటర్‌లో అభిమానులతో కలిసి 'పంజా' చిత్రాన్ని వీక్షించారు. థియేటర్ ప్రాంగణంలో అభిమానుల ఉత్సాహం, అక్కడ నెలకొన్న పండుగ వాతావరణాన్ని చూసిన ఎమ్మెల్యే తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు.

**ఉత్సాహభరితంగా కేక్ కటింగ్ వేడుక**

సినిమా వీక్షణ అనంతరం అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేక్ కట్ చేసి శ్రీ పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బాణాసంచా వెలుగులు, జనసేన నినాదాల మధ్య లీలామహల్ థియేటర్ పరిసర ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది.

**కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ నాయకత్వం జనసేన కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూ, అభిమానుల్లో కొండంత ఉత్సాహాన్ని నింపుతూ, ప్రజలకు నిజమైన భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి జనసేన కార్యకర్త ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

**పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు, అభిమానులు**

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శ్రీ శివ ప్రసాద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాదిక్, ప్రముఖ నాయకుడు జీకేతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు అత్యంత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అభిమానుల కేరింతలు, వరుస నినాదాలతో ఈ కార్యక్రమం చివరి వరకు ఎంతో ఉత్సాహభరితంగా సాగింది.

# బంగారం తగ్గినా.. వెండి మోత మోగించింది! నేటి గోల్డ్, సిల్వర్ రేట్లు ఇవే



అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ ఇండెక్స్‌లో మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోలు ఆసక్తి ప్రభావంతో దేశీయంగా బంగారం ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో 22 క్యారెట్లు, 24 క్యారెట్ల బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. మంగళవారం ఉదయం బులియన్ మార్కెట్‌లో భిన్నమైన పరిస్థితి కనిపించింది. ఒకవైపు బంగారం ధరలు స్వల్పంగా తగ్గగా.. మరోవైపు వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, పెట్టుబడిదారుల అంచనాలు, డాలర్ కదలికలు వంటి అంశాల ప్రభావంతో విలువైన లోహాల ధరల్లో ప్రతిరోజూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం బంగారం కాస్త దిగిరాగా, వెండి మాత్రం వేగంగా పైకి కదిలింది. మనీకంట్రోల్ ఉదయం 9:05 గంటలకు వెల్లడించిన లైవ్ మార్కెట్ వివరాల ప్రకారం, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఆ)లో అక్టోబర్ 5 ఫ్యూచర్స్ కాంట్రాక్టులో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,54,282 వద్ద ట్రేడవుతోంది. గత ట్రేడింగ్ సెషన్ ముగింపు ధరతో పోలిస్తే ఇది రూ.173 తగ్గింది. అంటే బంగారం ధరలో స్వల్పంగా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఇక వీజఆలో వెండి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా కదిలింది. సెప్టెంబర్ 4 ఫ్యూచర్స్ కాంట్రాక్టులో కిలో వెండి ధర రూ.2,34,691 వద్ద ట్రేడవుతోంది. గత ట్రేడింగ్ సెషన్ ముగింపుతో పోలిస్తే కిలో వెండి ధర రూ.850 పెరిగింది. తక్కువ సమయంలోనే వెండి ధరలో ఈ స్థాయిలో పెరుగుదల కనిపించడం మార్కెట్‌లో పెట్టుబడిదారుల ఆసక్తిని సూచిస్తోంది. ఫ్యూచర్స్ మార్కెట్‌లో మాత్రమే కాకుండా హైదరాబాద్ స్పాట్ బులియన్ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. ఎబ్రిశ్రీఆశీఅం.ఏశీ.ఆఅ ఉదయం 9:07 గంటలకు వెల్లడించిన ధరల ప్రకారం, హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు గత ముగింపు ధరతో పోలిస్తే రూ.100 తగ్గింది. దీంతో ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,780 వద్ద కొనసాగుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర కూడా స్వల్పంగా తగ్గింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు ప్రస్తుతం రూ.1,41,880గా ఉంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి మంగళవారం ఉదయం కొంత ఊరట లభించినట్లయింది.

# జొమాటో యాప్‌లో ఆ వంటకాలపై నిషేధం.. అసలు కారణం ఇదే!



జొమాటోలో ఫుడ్ ఆర్డర్ చేసే వారికి కీలక అప్‌డేట్. అనలాగ్ చీజ్, పనీర్ వంటి ప్రత్యామ్నాయ డెయిరీ ఉత్పత్తులతో తయారైన వంటకాలపై జొమాటో కఠిన నిర్ణయం తీసుకుంది. నిబంధనలు పాటించని రెస్టారెంట్లను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. జొమాటోలో ఆహారం ఆర్డర్ చేసే కస్టమర్లకు అలర్ట్. తమ ప్లాట్‌ఫామ్‌లో అనలాగ్ చీజ్, అనలాగ్ పనీర్ లేదా ఇతర అనలాగ్ డెయిరీ ఉత్పత్తులతో తయారైన వంటకాలను అమ్మే రెస్టారెంట్లపై జొమాటో కఠిన చర్యలు తీసుకోనుంది. నిబంధనలు పాటించని రెస్టారెంట్లను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించే హక్కు తమకు ఉందని కంపెనీ స్పష్టం చేసింది. అసలు పాల ఉత్పత్తులు, చీజ్ లాంటి వాటికి బదులుగా తక్కువ ధరలో దొరికే ప్రత్యామ్నాయ పదార్థాలను ఉపయోగించి తయారు చేసే ఆహారాన్ని అనలాగ్ ఫుడ్ అంటారు. ఉదాహరణకు, నిజమైన పాలు లేదా చీజ్‌కు బదులుగా ప్లాంట్ ఆయిల్స్ వంటి పదార్థాలను ఉపయోగిస్తారు. బయటకు చూస్తే మాత్రం అసలు ఉత్పత్తిలాగే కనిపించేలా తయారు చేస్తారు. మహారాష్ట్రలో ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టిందన్న వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం వచ్చింది. అలాగే ఢిల్లీలోని ఫైవ్ స్టార్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తనిఖీలు నిర్వహించింది. దీంతో ఆహార భద్రతపై మరోసారి దృష్టి పెరిగింది. రెస్టారెంట్లు తమ మెనూలో 'అనలాగ్ డెయిరీ'గా ప్రకటించిన వంటకాలను వెంటనే జొమాటో నుంచి తొలగించినట్లు కంపెనీ సోమవారం తెలిపింది. ఇకపై కూడా నిబంధనలు పాటించని రెస్టారెంట్లను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగిస్తామని చెప్పింది. జొమాటో తన ప్లాట్‌ఫామ్‌లో ఉన్న రెస్టారెంట్ భాగస్వాములకు సోమవారం పంపిన సందేశంలో, కస్టమర్లకు ఆహారం గురించి సరైన సమాచారం అందడం, సురక్షితమైన ఆహారం లభించడం, ఆశించిన నాణ్యత ఉండడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపింది. అందుకే అనలాగ్ చీజ్, అనలాగ్ పనీర్ లేదా ఇతర అనలాగ్ డెయిరీ ఉత్పత్తులు ఉన్న ఆహారాన్ని తమ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ చేయడం, విక్రయించడంపై జీరో టాలరెన్స్ పాలసీ అమలు చేస్తున్నట్లు జొమాటో పేర్కొంది. కస్టమర్లకు ఆహారం విషయంలో మరింత పారదర్శకత తీసుకురావడంతో పాటు, ఫుడ్ క్వాలిటీని మెరుగుపరచడం కోసం ఈ చర్య తీసుకున్నామని కంపెనీ తెలిపింది. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు, ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. ఇప్పటికే తమ మెనూలో అనలాగ్ చీజ్, అనలాగ్ పనీర్ లేదా ఇతర అనలాగ్ డెయిరీ ఉత్పత్తులను ఉపయోగిస్తున్నట్లు ప్రకటించిన రెస్టారెంట్లలోని అలాంటి వంటకాలను వెంటనే ప్లాట్‌ఫామ్‌లో ఆఫ్ చేస్తామని జొమాటో తెలిపింది. అనలాగ్ డెయిరీ ఉత్పత్తులు వాడుతున్న రెస్టారెంట్లు వెంటనే కొన్ని చర్యలు తీసుకోవాలని జొమాటో సూచించింది. సహజమైన డెయిరీ ఉత్పత్తులకు మారాలని చెప్పింది. వెంటనే మారడం సాధ్యం కాకపోతే అనలాగ్ డెయిరీ ఉత్పత్తులు ఉన్న వంటకాలను మెనూ నుంచి తొలగించాలని సూచించింది. అలాగే రెస్టారెంట్లకు సరఫరా చేసే సంస్థలు ఇచ్చే ప్రొడక్ట్ లేబుల్స్, ఇన్‌గ్రిడియెంట్ వివరాలను కూడా రెస్టారెంట్లు మరోసారి పరిశీలించాలని జొమాటో చెప్పింది. వంటల్లో నిజంగా ఏ పదార్థాలు ఉపయోగిస్తున్నారో చెక్ చేసుకుని, జొమాటోలో లిస్ట్ చేసిన ఆహారం గురించి కస్టమర్లకు సరైన సమాచారం

# క్రెడిట్ కార్డుతో పండుగ షాపింగ్... ఈ టిప్స్ పాటిస్తే వేల రూపాయల ఆదా




పండుగ సీజన్ మొదలైంది. దసరా, దీపావళి రావడంతో ఈ సీజన్ ఊపందుకుంటుంది. మరి ఈ ఫెస్టివల్ సీజన్‌లో ఆఫర్స్ వలలో పడి మీ క్రెడిట్ కార్డును వాడేస్తున్నారా? అయితే జాగ్రత్త. ఈ టిప్స్ గుర్తుంచుకుంటే మీకు వేల రూపాయలు ఆదా అవుతాయి. పండుగల సీజన్‌లో ఎక్కడ చూసినా భారీ సేల్స్ కనిపిస్తున్నాయి. డిస్కౌంట్లు, ఆఫర్లు చూసి కొనుగోళ్లు పెరగడం సహజమే. అయితే క్రెడిట్ కార్డుతో ఖర్చు చేయడం చాలా సులభం కావడంతో, చివరికి బిల్లు ఎంత వచ్చిందో చూసి షాక్ అవ్వొచ్చు. కొన్ని సింపుల్ రూల్స్ పాటిస్తే పండుగ ఖర్చులు అదుపు తప్పకుండా చూసుకోవచ్చు. పండుగలు వచ్చాయంటే ఖర్చులు కూడా పెరుగుతాయి. గిఫ్టులు, కొత్త బట్టలు, ఇంటి డెకరేషన్, ప్రత్యేక వంటకాలు ఇలా ఒక్కో ఖర్చు కలుస్తూ పెద్ద మొత్తంగా మారిపోతుంది. క్రెడిట్ కార్డుతో వీటన్నింటికీ చెల్లించడం చాలా ఈజీ. కానీ ఇదే సౌకర్యం వల్ల ఎంత ఖర్చు చేశామో తెలియకుండా పోయే అవకాశం ఉంది. బిల్లు వచ్చినప్పుడు మొత్తం చూసి టెన్షన్ మొదలవుతుంది. పండుగల సమయంలో ఖర్చులు తగ్గించుకోవాల్సిన అవసరం లేదని ఫైనాన్షియల్ ప్లానర్లు చెబుతున్నారు. ముందుగా మనం ఎంత ఖర్చు చేయగలమో నిర్ణయించుకుని, ఆ పరిమితిలోనే షాపింగ్ చేయడం ముఖ్యం అని సీఎన్‌బీసీటీవీ18 కథనం వివరిస్తోంది. మీరూ ఈ టిప్స్ గుర్తుంచుకోండి. వేడుకల ఖర్చుల్లో ఆహారం, స్వీట్లు, డెకరేషన్, ఇంట్లో అతిథులకు చేసే ఏర్పాట్లు ఉండొచ్చు. ఊహించని చిన్న ఖర్చుల కోసం కొంత మొత్తాన్ని ఇతర ఖర్చుల కేటగిరీలో ఉంచుకోవచ్చు. ప్రతి కేటగిరీకి ఒక వాస్తవిక పరిమితి పెట్టుకున్న తర్వాత వాటన్నింటినీ కలపండి. అదే మీ పండుగ బడ్జెట్. క్రెడిట్ కార్డు బిల్లు వచ్చినప్పుడు ఆ మొత్తాన్ని పూర్తిగా చెల్లించగలిగేంతగా ఈ బడ్జెట్ ఉండటం మంచిది. చాలా మంది చేసే ఒక తప్పు ఏంటంటే, క్రెడిట్ కార్డు లిమిట్‌ను తమ ఖర్చు లిమిట్‌గా భావించడం. బ్యాంక్ మీకు రూ.2 లక్షల క్రెడిట్ లిమిట్ ఇచ్చిందంటే, మీ దగ్గర ఖర్చు చేయడానికి రూ.2 లక్షలు ఉన్నాయని అర్థం కాదు. మీరు ఎంత ఖర్చు చేయాలో మీ చేతిలో మిగిలే ఆదాయం, బిల్లు తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని బట్టి నిర్ణయించుకోవాలి. బ్యాంక్ ఎంత వరకు అప్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నదాన్ని బట్టి కాదు. ఖర్చు చేస్తున్నప్పుడే ట్రాక్ చేయండి. బడ్జెట్ పెట్టుకోవడం సులభమే. కానీ ఆ బడ్జెట్ దాటిపోతున్నామా లేదా అన్నది గమనించడం కొంచెం కష్టం. బ్యాంకింగ్ యాప్స్, ట్రాన్సాక్షన్ అలర్ట్స్ దీనికి బాగా ఉపయోగపడతాయి. పండుగ షాపింగ్ ఎంత జరుగుతోందో బిల్లు వచ్చిన తర్వాత తెలుసుకోవడం కాకుండా, అప్పటికప్పుడే చూసుకునే అవకాశం ఉంటుంది. క్రెడిట్ కార్డుతో చేసే ప్రతి ట్రాన్సాక్షన్‌కు నోటిఫికేషన్లు వచ్చేలా చేసుకోవచ్చు. లేదా మనకు నచ్చిన ఒక మొత్తానికి మించిన కొనుగోళ్లకు మాత్రమే అలర్ట్స్ పెట్టుకోవచ్చు. కొన్ని బ్యాంకింగ్ యాప్స్‌లో ఖర్చు ఒక నిర్దిష్ట పరిమితిని దాటినప్పుడు కూడా అలర్ట్ వచ్చే సదుపాయం ఉంటుంది. ఉదాహరణకు, పండుగ ఖర్చుల కోసం రూ.50,000 కేటాయించారని అనుకుందాం. బడ్జెట్‌లో 50 శాతం అంటే రూ.25,000 ఖర్చు చేసినప్పుడు ఒక అలర్ట్, 80 శాతం అంటే రూ.40,000 చేరుకున్నప్పుడు మరో అలర్ట్ వచ్చేలా పెట్టుకోవచ్చు. డబ్బు మొత్తం అయిపోకముందే ఖర్చులు తగ్గించుకునే అవకాశం దీంతో వస్తుంది. షాపింగ్ ఎక్కువగా చేసే రోజుల్లో రోజుకు ఒకసారి బ్యాంకింగ్ యాప్ చెక్ చేయడం కూడా ఉపయోగపడుతుంది. ప్రమాదం ఎప్పుడూ ఒక పెద్ద కొనుగోలు వల్లే రావాల్సిన అవసరం లేదు. చిన్నగా అనిపించే పది, ఇరవై కొనుగోళ్లు కలిసినా పెద్ద బిల్లుగా మారొచ్చు. మొత్తం ఖర్చు ఎంత పెరుగుతుందో చూస్తూ ఉంటే, ఆలస్యం కాకముందే కొన్ని ఖర్చులను తగ్గించుకోవచ్చు. ప్రతి కొనుగోలును ఒక కేటగిరీలో పెట్టండి. మీ బడ్జెట్‌లో పెట్టుకున్న కేటగిరీలే ఇంపల్స్ షాపింగ్‌ను అడ్డుకునే సింపుల్ మార్గంగా కూడా ఉపయోగపడతాయి. ఉదాహరణకు, బట్టల కోసం రూ.15,000 బడ్జెట్ పెట్టుకుని ఆ మొత్తం ఇప్పటికే ఖర్చు చేశారని అనుకుందాం. ఇప్పుడు ఒక ఫెస్టివ్ సేల్‌లో మరో డ్రెస్‌పై "40 శాతం డిస్కౌంట్" ఉందని చూసినా, మీ బట్టల బడ్జెట్‌లో అదనంగా రూ.5,000 వచ్చేసినట్లు కాదు. ఒక కేటగిరీకి కేటాయించిన మొత్తం పూర్తయితే, ఆ కేటగిరీలో ఖర్చు కూడా ఆపేయాలి. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసినా, మాల్‌కు వెళ్లి కొనుగోలు చేసినా ముందే తయారు చేసుకున్న లిస్ట్‌ను పాటించడం ఈ రూల్‌ను ఫాలో అవ్వడానికి సహాయపడుతుంది. ముందుగా ప్లాన్ చేయని, అవసరం లేని వస్తువు కొనాలనిపిస్తే 24 గంటల రూల్ పాటించొచ్చు. వెంటనే కొనకండి. ఒక రోజు ఆగండి. మరుసటి రోజు కూడా అది కావాలని అనిపిస్తే, మీ బడ్జెట్‌లో ఆ ఖర్చుకు చోటుంటే అప్పుడే కొనడం గురించి ఆలోచించండి. చాలాసార్లు సేల్ చూసిన ఉత్సాహం తగ్గిపోయిన తర్వాత కొనాలన్న కోరిక కూడా పోతుంది. 'నో-కాస్ట్ ఈఎంఐ' ట్రాప్ విషయంలో జాగ్రత్త. ఫెస్టివ్ సేల్స్‌లో "నో-కాస్ట్ ఈఎంఐ", "బై నౌ పే లేటర్" లాంటి ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తాయి. ఖరీదైన వస్తువులు కూడా చాలా చవకగా కొనగలిగినట్టుగా ఇవి అనిపించొచ్చు. రూ.60,000 విలువైన వస్తువును ఒకేసారి కొనడం కంటే నెలకు రూ.5,000 చెల్లించాలంటే సులభంగా అనిపించవచ్చు. కానీ వస్తువు ధర మాయమైపోలేదు. ఆ ఖర్చు రాబోయే నెలలకు వెళ్లిపోయింది అంతే. ఇలాంటి కొనుగోళ్లు ఒకటికి మించి చేస్తే, భవిష్యత్తులో వచ్చే ఆదాయంలో పెద్ద భాగం ముందే ఈఎంఐల కోసం కేటాయించాల్సి రావచ్చు.



# అంత పెద్ద క్రికెటర్.. ఇంత సింపులా? నెట్టింట వైరల్ అవుతున్న 551 వికెట్ల బౌలర్ మెట్రో జర్నీ!

భారత క్రికెట్ జట్టు మాజీ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ జవగల్ శ్రీనాథ్ తన నిరాడంబరతతో మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ప్రముఖ సెలబ్రిటీ అయినప్పటికీ ఎలాంటి హంగులూ, ఆర్భాటాలు లేకుండా ఆయన సాధారణ ప్రయాణికుడిలా మెట్రో రైల్లో ప్రయాణించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రైవేట్ వాహనాల్లో కాకుండా మెట్రో రైలులో ప్రయాణాన్ని ఎంచుకున్న శ్రీనాథ్ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. లింక్డ్ఇన్ వేదికగా మొదటిసారి షేర్ చేసిన ఈ ఫొటోకు వేల సంఖ్యలో లైకులు, ప్రశంసల వర్షం కురుస్తున్న కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఫొటోలో శ్రీనాథ్ స్కై-బ్లూ షర్ట్, డెనిమ్ జీన్స్ ధరించి, ఒక చేతిలో ట్రాలీ బ్యాగ్‌ను పట్టుకుని మెట్రో కోచ్ మూలన సాధారణ పౌరుడిలా నిల్చొని కనిపించారు. కాళ్లకు సెమీ-ఫార్మల్ బ్రౌన్ లెదర్ షూస్ ధరించి అత్యంత హుందాగా, సాదాసీదాగా కనిపించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మ్యాచ్ రిఫరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జవగల్ శ్రీనాథ్, భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ పేసర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. టెస్ట్ క్రికెట్: 1991 నుంచి 2002 మధ్య కాలంలో భారత్ తరఫున 67 టెస్ట్ మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించిన ఆయన, 30.49 సగటుతో మొత్తం 236 వికెట్లు పడగొట్టారు. ఇందులో 10 సార్లు ఐదు వికెట్ల ఘనత, ఒక మ్యాచ్‌లో పది వికెట్లు తీసిన రికార్డు ఉన్నాయి. ఆయన అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 8/86. టెస్ట్ ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన 10వ బౌలర్‌గా శ్రీనాథ్ కొనసాగుతున్నారు. వన్డే క్రికెట్: 229 వన్డే మ్యాచ్‌లు ఆడిన శ్రీనాథ్, 28.08 సగటుతో 315 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నారు. వన్డేల్లో ఆయన 3 సార్లు ఐదు వికెట్ల మైలురాయిని అందుకోగా, అత్యుత్తమ ప్రదర్శన 5/23గా నమోదైంది. ఎంతో ఘనమైన క్రీడా చరిత్ర, ఉన్నత హోదా ఉన్నప్పటికీ ఏమాత్రం గర్వం లేకుండా నేలమీద ఉండే ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శప్రాయమని నెటిజన్లు కొనియాడుతున్నారు.

# జకోవిచ్ కథ ముగిసే.. కోర్టులోనే కన్నీరుపెట్టుకున్న దిగ్గజం

టెన్నిస్ దిగ్గజం, నాలుగో సీడ్ నోవాక్ జకోవిచ్‌కు యూఎస్ ఓపెన్‌లో ఊహించని షాక్ తగిలింది. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ వేటలో న్యూయార్క్‌లో అడుగుపెట్టిన 39 ఏళ్ల జకోవిచ్ ప్రయాణం తొలి రౌండ్‌లోనే ముగిసింది. తీవ్రమైన ఎండ, తేమ, అనారోగ్యం, శారీరక అలసటతో పోరాడిన జకోవిచ్.. అర్జెంటీనా ఆటగాడు మరియానో ??నవోన్‌తో జరిగిన మారథాన్ ఐదు సెట్ల పోరులో 6-7, 7-5, 6-4, 2-6, 1-6 తేడాతో ఓటమిపాలయ్యాడు. ఆర్థర్ యాష్ స్టేడియంలో మ్యాచ్ ఆరంభం నుంచే జకోవిచ్ శారీరకంగా ఇబ్బంది పడుతూ కనిపించాడు. న్యూయార్క్‌లోని తీవ్ర ఉక్కపోత, తేమ వాతావరణం వల్ల తలపై పదే పదే ఐస్ బ్యాగ్ పెట్టుకున్నాడు. వర్షం కారణంగా స్టేడియం రూఫ్ మూసివేసినప్పుడు ఏసీ ఆన్ చేయాలని సూపర్వైజర్‌ను కూడా కోరాడు. మూడో సెట్ ఆరో గేమ్‌లో పరిస్థితి మరింత విషమించి, జకోవిచ్ కోర్టు వెనుకభాగంలో పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. టోర్నమెంట్ ఫిజియో అతనికి మాత్రలు అందించగా, కోర్టు పక్కనుంచి సహాయక బృందం ద్రవాలు అందించింది అద్భుత పోరాటం.. కానీ తప్పని ఓటమి తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 6-7తో కోల్పోయినప్పటికీ, తీవ్రమైన శారీరక ఇబ్బందుల నడుమ జకోవిచ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్‌ను 7-5తో, మూడో సెట్‌ను 6-4తో గెలుచుకుని విజయానికి కేవలం ఒక్క సెట్ దూరంలో నిలిచాడు. అయితే, యువ ఆటగాడు నవోన్ తగ్గకుండా నాలుగో సెట్‌ను 6-2తో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఈ స్టేడియం నిర్మాణం కోసం ఎంపిక చేయబోయే ప్రాంతం ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు మార్గం, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో ఉండేలా చూస్తున్నారు. దీనివల్ల ప్రేక్షకులు సులభంగా రాకపోకలు సాగించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో రానున్న స్పోర్ట్స్ సిటీ, టూరిజం, నెట్ జీరో సిటీ కాన్సెప్ట్‌లో ఈ క్రీడా ప్రాంగణం ఒక కీలక ఆకర్షణగా నిలవనుంది. కేవలం క్రికెట్‌కే కాకుండా ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, భారీ సంగీత కచేరీలు (కాన్సర్ట్‌లు) నిర్వహించేందుకు వీలుగా దీనిని మల్టీపర్పస్ వేదికగా తీర్చిదిద్దనున్నారు. అయితే ఐదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సమయంలో ఇప్పటికే సగానికిపైగా అంటే మూడేళ్లు పదవీకాలం పూర్తైపోయింది. మిగిలిన రెండేళ్లలో ఈ ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని పూర్తి చేస్తుందా లేదా అనేది విషయంపై స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంది. లేటెస్ట్ క్రికెట్ అప్‌డేట్స్, మ్యాచ్ అప్‌డేట్స్, మ్యాచ్ రివ్యూస్, లైవ్



# తాజా చేపలా? పాడైపోయినవా?.. కొనేముందు ఈ 5 చిట్కాలతో ఇట్టే గుర్తించండి!





పాడైపోయిన లేదా సరిగ్గా నిల్వ చేయని చేపలను తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. అందుకే మార్కెట్‌లో చేపలు కొనేటప్పుడు అవి తాజాగా ఉన్నాయో లేదో గుర్తించడం చాలా ముఖ్యం. కొన్ని సులభమైన విషయాలను గమనిస్తే పాడైన చేపలను కొనకుండా జాగ్రత్త పడవచ్చు. చేపలు మన ఆహారంలో ముఖ్యమైన భాగం. వీటిలో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, ఖనిజాలు వంటి పలు పోషకాలు లభిస్తాయి. అయితే చేప తాజాగా లేకపోతే మాత్రం ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. పాడైపోయిన లేదా సరిగ్గా నిల్వ చేయని చేపలను తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. అందుకే మార్కెట్‌లో చేపలు కొనేటప్పుడు అవి తాజాగా ఉన్నాయో లేదో గుర్తించడం చాలా ముఖ్యం. కొన్ని సులభమైన విషయాలను గమనిస్తే పాడైన చేపలను కొనకుండా జాగ్రత్త పడవచ్చు. కళ్లను ముందుగా పరిశీలించండి: చేప తాజాగా ఉందో లేదో తెలుసుకోవడానికి దాని కళ్లను చూడటం ఒక సులభమైన మార్గం. తాజా చేప కళ్లకు సాధారణంగా స్పష్టత, మెరుపు ఉంటుంది. అవి కొద్దిగా ఉబ్బెత్తుగా కూడా కనిపిస్తాయి. కళ్లపై మబ్బులా పొర ఏర్పడి, అవి లోపలికి కుంగిపోయినట్లు లేదా పూర్తిగా నిర్జీవంగా కనిపిస్తే ఆ చేప పాతది అయి ఉండే అవకాశం ఉంది. మొప్పలను గమనించండి: చేపల మొప్పలు కూడా తాజాదనాన్ని గుర్తించడంలో సహాయపడతాయి. తాజా చేపల మొప్పలు సాధారణంగా ఎరుపు లేదా గులాబీ రంగులో తేమగా కనిపిస్తాయి. అవి గోధుమ, బూడిద రంగులోకి మారి, రంగు వెలిసినట్లు కనిపిస్తే ఆ చేపను కొనకుండా ఉండటం మంచిది. వాసన చాలా ముఖ్యం: తాజా చేపకు తేలికపాటి సహజమైన వాసన ఉంటుంది. సముద్ర చేపలకు సముద్రపు వాసన, నది చేపలకు సాధారణ చేప వాసన ఉండవచ్చు. కానీ చేప నుంచి బలమైన కుళ్లిన వాసన, అసహ్యకరమైన దుర్వాసన లేదా అమ్మోనియా వాసన వస్తే జాగ్రత్తగా ఉండాలి. అలాంటి చేప తాజాగా ఉండకపోవచ్చు. మాంసాన్ని తేలికగా నొక్కి చూడండి: చేప మాంసం గట్టిగా, సాగేలా ఉండాలి. వేలితో మెల్లగా నొక్కినప్పుడు ఏర్పడిన గుంత త్వరగా తిరిగి సాధారణ స్థితికి వస్తే అది తాజా చేపకు సంకేతం కావచ్చు. మాంసం చాలా మెత్తగా ఉండి, నొక్కిన చోట గుర్తు అలాగే ఉండిపోతే ఆ చేప పాతది అయి ఉండే అవకాశం ఉంది. చర్మం, పొలుసులను పరిశీలించండి: తాజా చేప చర్మం సహజమైన మెరుపుతో, తేమగా కనిపిస్తుంది. పొలుసులు చర్మానికి గట్టిగా అతుక్కుని ఉంటాయి. చర్మం పొడిబారినట్లు, రంగు మారినట్లు కనిపించడం లేదా పొలుసులు సులభంగా ఊడిపోవడం కనిపిస్తే కొనకుండా ఉండటం మంచిది. చేపలను సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేస్తున్నారా, ఐస్ శుభ్రంగా ఉందా, చేపలను పరిశుభ్రమైన ప్రదేశంలో ఉంచుతున్నారా అనే విషయాలు చూడాలి. ప్యాక్ చేసిన చేపలను కొనుగోలు చేస్తే ప్యాకెట్ సీల్, గడువు తేదీ, నిల్వ సూచనలు తప్పకుండా పరిశీలించాలి. ప్యాకెట్ ఉబ్బిపోయి ఉండటం, లీకేజీ కనిపించడం లేదా రంగు, వాసనలో మార్పు ఉంటే కొనకపోవడం మంచిది. చేపలను ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ఎక్కువసేపు బయట ఉంచకుండా వీలైనంత త్వరగా ఫ్రిజ్‌లో పెట్టాలి. వెంటనే వండబోతే శుభ్రంగా కడిగి, సరైన పద్ధతిలో వండుకోవాలి. చేపను సరిగ్గా నిల్వ చేయడం, పూర్తిగా ఉడికించడం కూడా ఆహార భద్రతకు చాలా ముఖ్యం. తాజా చేపను గుర్తించడానికి కళ్లు, మొప్పలు, వాసన, మాంసం, చర్మం అనే ఐదు విషయాలను తప్పకుండా పరిశీలించండి. ఃఅంఎశ్రీఖఅఎవతీ: ఇది సాధారణ ఆహార భద్రత సమాచారం మాత్రమే. చేప చెడిపోయిందని అనిపిస్తే రుచి చూసి పరీక్షించకండి. అనుమానం ఉంటే దాన్ని తినకుండా ఉండటం సురక్షితం.



# ఇంట్లోనే కరివేపాకు కారం పొడి.. ఒక్కసారి చేస్తే నెలరోజులు వాడుకోవచ్చు!



కరివేపాకు కారం పొడిని కేవలం నంజుకోవడానికి మాత్రమే కాకుండా వివిధ రకాల వేపుడు కూరల్లో కూడా ఉపయోగించవచ్చు. సాధారణ వేపుడికి చివర్లో కొద్దిగా ఈ పొడి కలిపితే కూరకు మంచి సువాసన, రుచి వస్తాయి. ముఖ్యంగా ఇంట్లోనే తయారు చేసుకుంటే మనకు నచ్చినంత కారం, మసాలా వేసుకోవచ్చు. కరివేపాకు కారం పొడి అంటే ఇష్టపడని వారు చాలా తక్కువ మందే ఉంటారు. వేడి వేడి ఇడ్లీ, అట్టు, దోశ లేదా అన్నంలో నెయ్యి వేసుకుని ఈ కారం పొడి కలుపుకుని తింటే రుచి అదిరిపోతుంది. అంతేకాదు, కరివేపాకు కారం పొడిని కేవలం నంజుకోవడానికి మాత్రమే కాకుండా వివిధ రకాల వేపుడు కూరల్లో కూడా ఉపయోగించవచ్చు. సాధారణ వేపుడికి చివర్లో కొద్దిగా ఈ పొడి కలిపితే కూరకు మంచి సువాసన, రుచి వస్తాయి. ముఖ్యంగా ఇంట్లోనే తయారు చేసుకుంటే మనకు నచ్చినంత కారం, మసాలా వేసుకోవచ్చు. గృహిణి శ్రావణి (32 ఏళ్లు) తెలిపిన వివరాల ప్రకారం, కరివేపాకు కారం పొడి తయారీలో ముఖ్యంగా ముదురు కరివేపాకును ఎంచుకోవడం మంచిది. ముదురు ఆకుల్లో మంచి సువాసన ఉండటంతో పాటు వాటిని వేయించి పొడి చేసినప్పుడు చక్కని రుచి వస్తుంది. వీలైతే నాటు కరివేపాకు ఉపయోగిస్తే మరింత మంచి వాసన వస్తుంది. ముందుగా కరివేపాకును శుభ్రంగా కడిగి నీటిని పూర్తిగా వడకట్టాలి. ఆ తర్వాత శుభ్రమైన గుడ్డపై పరిచి నీడలో రాత్రంతా ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల ఆకుల్లోని తేమ తగ్గి, వేయించేటప్పుడు త్వరగా పొడిగా మారుతాయి. తేమ ఎక్కువగా ఉంటే తయారు చేసిన పొడి త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. కరివేపాకును వేయించేటప్పుడు ఎక్కువ మంట పెట్టకూడదు. తక్కువ లేదా మీడియం మంటపై కొన్ని నిమిషాలు వేయిస్తే సరిపోతుంది. ఆకులు కరకరలాడేంత వరకు వేయించాలి. మరీ ఎర్రగా లేదా కాలిపోయేలా వేయిస్తే కరివేపాకు సహజమైన సువాసన తగ్గిపోతుంది. పప్పులు, వేరుశెనగ వంటి పదార్థాలను కూడా నెమ్మదిగా వేయించాలి. అవి లోపలి వరకు బాగా వేగితేనే కారం పొడికి మంచి రుచి వస్తుంది. వేరుశెనగ నూనె ఉపయోగిస్తే మంచి రుచి వస్తుందని కొందరు భావిస్తారు.

# తక్కువ మసాలాలు.. అదిరిపోయే టేస్ట్.. వైట్ వెజిటబుల్ పులావ్ రెసిపీ ఇదిగో!

తక్కువ మసాలాలతో, కూరగాయల రుచితో సింపుల్‌గా తయారు చేసుకునే వైట్ వెజిటబుల్ పులావ్ కూడా చాలా టేస్టీగా ఉంటుంది. ముఖ్యంగా బంగాళాదుంపలు, క్యారెట్, బీన్స్, పచ్చి బఠానీలు వంటి కూరగాయలు ఇందులో కలవడంతో టేస్ట్‌తో పాటు కలర్, పోషక విలువలు పెరుగుతాయి. పులావ్.. ఈజీగా చేసే ఈ రెసిపికి ఫ్యాన్స్ బేస్ బరాబర్ అలగ్ ఉంటుంది. అసలు పులావ్ అంటే ఇష్టపడని వారుండరు. సాధారణంగా పులావ్‌లో ఎక్కువ మసాలాలు, కారం ఉపయోగిస్తారు. అయితే తక్కువ మసాలాలతో, కూరగాయల రుచితో సింపుల్‌గా తయారు చేసుకునే వైట్ వెజిటబుల్ పులావ్ కూడా చాలా టేస్టీగా ఉంటుంది. ముఖ్యంగా బంగాళాదుంపలు, క్యారెట్, బీన్స్, పచ్చి బఠానీలు వంటి కూరగాయలు ఇందులో కలవడంతో టేస్ట్‌తో పాటు కలర్, పోషక విలువలు పెరుగుతాయి. ఇంట్లో త్వరగా తయారు చేసుకోవాలనుకునే వారికి ఈ పులావ్ మంచి ఆప్షన్. పెరుగు, రైతా లేదా సాధారణ కూరతో కలిపి తింటే మరింత రుచిగా ఉంటుంది. ఈ వైట్ వెజిటబుల్ పులావ్ తయారు చేయడానికి ఒక కప్పు బాస్మతి బియ్యం, రెండు బంగాళాదుంపలు, రెండు క్యారెట్లు, 50 గ్రాముల బీన్స్, అర కప్పు పచ్చి బఠానీలు, ఒక పెద్ద ఉల్లిపాయ, ఒక టమాటా, ఐదు పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, ఒక దాల్చినచెక్క ముక్క, మూడు లవంగాలు, మూడు యాలకులు, ఒక పలావ్ ఆకు, నూనె, కొద్దిగా నెయ్యి, కొత్తిమీర, ఉప్పు అవసరమవుతాయి. ముందుగా బాస్మతి బియ్యాన్ని రెండు లేదా మూడు సార్లు నీటితో బాగా కడిగి, సుమారు 30 నిమిషాల పాటు నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల బియ్యం త్వరగా ఉడకడంతో పాటు మెత్తగా కాకుండా పొడవుగా, విడివిడిగా వచ్చే అవకాశం ఉంటుంది. ఈలోపు బంగాళాదుంపలు, క్యారెట్లు, బీన్స్‌ను చిన్న ముక్కలుగా కోసి సిద్ధంగా పెట్టుకోవాలి. ఉల్లిపాయను పొడవుగా, టమాటాను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌పై ప్రెషర్ కుక్కర్ పెట్టి కొద్దిగా నూనె, నెయ్యి వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక పలావ్ ఆకు, జీలకర్ర, దాల్చినచెక్క, లవంగాలు, యాలకులు వేసి వేయించాలి. వీటి నుంచి మంచి సువాసన వచ్చిన తర్వాత పొడవుగా కట్ చేసిన ఉల్లిపాయను వేసి లేత బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. అనంతరం టమాటా ముక్కలు, పచ్చిమిర్చి వేసి రెండు నిమిషాలు మధ్యస్థ మంటపై వేయించాలి. తర్వాత బంగాళాదుంపలు, క్యారెట్లు, బీన్స్, పచ్చి బఠానీలు వేసి కొద్దిగా ఉప్పు కలిపి రెండు మూడు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు బాగా కలపాలి. అనంతరం నానబెట్టిన బియ్యంలోని నీటిని పూర్తిగా వంపేసి కుక్కర్‌లో వేయాలి. బియ్యం ముక్కలు కాకుండా నెమ్మదిగా కలపాలి. కుక్కర్ పూర్తిగా చల్లారిన తర్వాత మూత తీసి అన్నాన్ని గరిటెతో బలంగా కలపకుండా, నెమ్మదిగా పైకి కిందికి తిప్పాలి. చివరగా సన్నగా తరిగిన కొత్తిమీర చల్లి వడ్డిస్తే వేడి వేడి వైట్ వెజిటబుల్ పులావ్ సిద్ధం. దీనిని ఉల్లిపాయ రైతా, దోసకాయ రైతా లేదా పెరుగు పచ్చడితో వడ్డిస్తే రుచి మరింత పెరుగుతుంది. తక్కువ మసాలాలతో సింపుల్‌గా, రుచిగా ఉండే ఈ పులావ్‌ను లంచ్ లేదా డిన్నర్‌కి సులభంగా తయారు చేసుకోవచ్చు.

## అరటిపండ్లు త్వరగా నల్లబడుతున్నాయా?.. ఈ అల్యూమినియం ఫాయిల్ చిట్కా ట్రై చేయండి!

ఒకేసారి గుత్తిగా అరటిపండ్లు కొనుగోలు చేసిన తర్వాత రెండు మూడు రోజుల్లోనే అవి గోధుమ రంగులోకి మారి మెత్తగా అయిపోవడం చాలామంది ఎదుర్కొనే సమస్య. అరటిపండ్లు త్వరగా పండే స్వభావం కలిగి ఉండటంతో వాటిని ఎక్కువ రోజులు నిల్వ చేయడం కొంత కష్టమే. వండిన ఆహారం వేడిగా, తాజాగా ఉండేలా మూతపెట్టి ఉంచడానికి అల్యూమినియం ఫాయిల్‌ను చాలామంది ఉపయోగిస్తారు. అయితే దీని ఉపయోగం వంటగదికే పరిమితం కాదు. అరటిపండ్లను ఎక్కువ రోజులు తాజాగా ఉంచడంలో కూడా అల్యూమినియం ఫాయిల్ ఉపయోగపడుతుందని చెబుతారు. ఒకేసారి గుత్తిగా అరటిపండ్లు కొనుగోలు చేసిన తర్వాత రెండు మూడు రోజుల్లోనే అవి గోధుమ రంగులోకి మారి మెత్తగా అయిపోవడం చాలామంది ఎదుర్కొనే సమస్య. అరటిపండ్లు త్వరగా పండే స్వభావం కలిగి ఉండటంతో వాటిని ఎక్కువ రోజులు నిల్వ చేయడం కొంత కష్టమే. అరటిపండ్లు చెట్టు నుంచి కోసిన తర్వాత కూడా పండుతూనే ఉంటాయి. వీటిని క్లైమాక్టెరిక్ ఫ్రూట్స్ అంటారు. పండే సమయంలో అరటిపండ్ల నుంచి ఇథిలీన్ అనే సహజ వాయువు విడుదలవుతుంది. ఈ వాయువు పెరిగే కొద్దీ అరటిపండ్లు త్వరగా మెత్తగా మారి, వాటి తొక్కపై గోధుమ లేదా నల్ల మచ్చలు ఏర్పడతాయి. ముఖ్యంగా అరటిపండ్ల గుత్తి పైభాగంలో ఉన్న కాడ నుంచి ఇథిలీన్ ఎక్కువగా విడుదలవుతుందని చెబుతారు. అందుకే ఆ కాడను ఫాయిల్‌తో చుట్టడం ద్వారా పండే ప్రక్రియను కొంత నెమ్మదించవచ్చని భావిస్తారు. ఈ చిట్కా కోసం ముందుగా అల్యూమినియం ఫాయిల్ నుంచి చిన్న చతురస్రాకార ముక్కను తీసుకోవాలి. అది అరటిపండ్ల కాడ భాగాన్ని పూర్తిగా కప్పేంత పరిమాణంలో ఉండాలి. ఇప్పుడు గుత్తి పైభాగంలోని కాడను ఫాయిల్‌తో బిగుతుగా చుట్టాలి. ఇంకా మెరుగైన ఫలితం కోసం గుత్తి నుంచి అరటిపండ్లను విడివిడిగా చేసి, ప్రతి అరటిపండు కాడ భాగాన్ని ప్రత్యేకంగా ఫాయిల్‌తో చుట్టుకోవచ్చు. ఇలా చేయడం వల్ల కాడ నుంచి వెలువడే ఇథిలీన్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయపడవచ్చు. ఫాయిల్‌తో చుట్టిన అరటిపండ్లను ఇంట్లో సాధారణ ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశంలో ఉంచాలి. వాటిపై నేరుగా సూర్యరశ్మి పడకుండా చూసుకోవాలి. అలాగే యాపిల్, అవకాడో వంటి ఇథిలీన్ ఎక్కువగా విడుదల చేసే పండ్ల పక్కన అరటిపండ్లను ఉంచకపోవడం మంచిది. ఇతర పండ్ల నుంచి కొంత దూరంగా ఉంచితే త్వరగా పండే ప్రక్రియను తగ్గించడంలో సహాయపడుతుంది.



CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889